ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 27.10.2026 | సంపుటి :13 సంచిక : 97 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మహాచర్చలు సఫలం



## తుమ్మిడిహెట్టిపై సీఎం ఫడణవీస్ సానుకూలం : సీఎం రేవంత్

## మహారాష్ట్రకు నష్టం లేకపోతే మాకు అభ్యంతరం లేదు : ఫడణవీస్

- గతంలోనూ తెలంగాణ రాష్ట్ర ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించామని వెల్లడి
- దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ముంబై(జనంసాక్షి): తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముంబయి వేదికగా తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం జరిగింది. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడి హెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. తుమ్మిడి హెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ

మిగతా 2లో..



### చర్చలు సఫలం..

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై చర్చలు సఫలమయ్యాయి. తెలంగాణ ప్రతిపాదనలను పెద్ద మనసుతో పరిశీలించిన ఫడణవీస్‌కు కృతజ్ఞతలు.. సాంకేతికత, ముంపు అంశాలపై అధ్యయనానికి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. గిరిజనుల జీవితాల మార్పునకు సహకరిస్తానని ఫడణవీస్ హామీ ఇచ్చారు.

- సీఎం రేవంత్ రెడ్డి

### ప్రతికూల ప్రభావం లేకపోతే..

మహారాష్ట్రకు ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే గతంలో కుదిరిన 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదు.తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై తెలంగాణ ప్రతిపాదన పట్ల గతంలోనూ మహారాష్ట్ర సానుకూల వైఖరి అనుసరించింది. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలి. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుంది

- మహారాష్ట్ర సీఎం ఫడణవీస్





# 'సర్' నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే..

## 'ఫారం 6'లో ఎటువంటి మార్పులు చేయలేదు • సుప్రీంకోర్టులో ఈసీ అఫిడవిట్

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే ఉన్నాయని పేర్కొంటూ సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం అఫిడవిట్ దాఖలు చేసింది. 'సర్'లో భాగంగా ఓటరు నమోదు కోసం ఉపయోగించే 'ఫారం 6'లో ఎటువంటి మార్పులు చేయలేదని తెలిపింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఈ అఫిడవిట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వెల్లడించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను విధుల నుంచి తప్పించాలన్న అభ్యర్థనలు చెల్లుబాటు కావని పేర్కొంది. వార్తాపత్రిక కథనాలను చట్టపరంగా సాక్ష్యంగా పరిగణించరని.. కాబట్టి, ఈ అంశంపై దాఖలైన పిటిషన్లను కొట్టేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరింది.

# మోదీకి చెప్పండి

## జ్ఞానేశ్‌ను తొలగిస్తే 30 సెకన్లలో ఆందోళన విరమిస్తాం:రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబరు 1న 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసనను వాయిదా వేయాలని స్థానిక వ్యాపార వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. దీపావళి పండగ నేపథ్యంలో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశాయి. ఈ వ్యవహారంపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు."ఢిల్లీలోని ప్రతి వ్యాపారి మాటను వింటున్నాం. వారి సమస్యలను అర్థం చేసుకుంటున్నాం. అయితే.. మెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసింది. రోడ్లనూ మూసివేసింది. దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచింది. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, సేవింగ్స్, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితం కాదు.

మిగతా 2లో..

"ఢిల్లీలోని ప్రతి వ్యాపారి మాటను వింటున్నాం. వారి సమస్యలను అర్థం చేసుకుంటున్నాం. అయితే.. మెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసింది. రోడ్లనూ మూసివేసింది. దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచింది. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, సేవింగ్స్, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితం కాదు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పండి. అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి" - రాహుల్ గాంధీ

## ఇక కౌంటర్ టికెట్లకూ 45 పైసలకే రూ.10 లక్షల బీమా



ఫతేనగర్‌లో ఈగల్ ఫోర్స్ సోదాలు..

## 65 మందికి డ్రగ్స్ పాజిటివ్

## రక్షణ రంగానికి భారీ ఊతం

రూ.2.12 లక్షల కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం



వివరాలు 2వ పేజీలో..

# గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

## ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు: హరీశ్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్లు తెస్తామంటున్నారనీ, అదే నిరూపిస్తే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్లు తేవడం కుదరదని తేలితే ఉత్తమ్ రాజీనామా చేస్తారా? అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిసిన నేపథ్యంలో.. హరీశ్‌రావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు."తెలంగాణ కంటే ఏపీలో వర్షపాత లోటు ఎక్కువ. అలాంటిది.. ఇక్కడ క్రాప్ హాలీడే ఎందుకు ఉంది? ఏపీలో ఎందుకు లేదు? దేవాదుల వద్ద పంపులు నడిపి ఉంటే వరంగల్ జిల్లాకు కరవు ఉండేది కాదు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నా ఎందుకు ఎత్తిపోయలేదు. కల్వకుర్తిలో ఐదు మోటార్లున్నా రెండు మోటార్లే నడుపుతున్నారు. అది కూడా రెండు గంటలే నడుపుతున్నారు. శ్రీశైలం నుంచి ఏపీ తీసుకెళ్తున్నదెంత? తెలంగాణ

మిగతా 2లో..

## గోదావరి జలాలపై బీఆర్ఎస్‌ది

# దుష్ప్రచారం

### జరిగిన నష్టం అంతా వారి వల్లే..

### కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన నీటిమట్టమే లేదు:ఎంపీ చామల



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణకు గోదావరి జలాల వినియోగంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన నీటిమట్టమే లేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 93.5 మీటర్ల నీటిమట్టం ఉంటేనే నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుందని.. ప్రస్తుతం 89 మీటర్ల ప్రవాహమే ఉందని వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దగ్గరా ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మరోవైపు, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేసే ఒప్పందానికి నాడు బీఆర్ఎస్ ప్రభుత్వమే అంగీకరించిందని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి నష్టం చేసిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు గోదావరి జలాలపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ గోదావరి జలాలను వినియోగించుకుంటున్నామని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. అదేవిధంగా

మిగతా 2లో..

# మేం చేసే ఆందోళన ప్రజల కోసమే..

### వ్యాపారుల అభ్యర్థనపై అతి త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం:ఖర్గే

## రాహుల్ గాంధీ కాన్వాయ్‌కి ప్రమాదం

2లో..





# పాస్‌పోర్ట్ అక్కర్లేదు.. నేరం చేసి పారిపోవచ్చు!

## తెలంగాణలో నేపాలీ ముఠాల వరుస దోపిడీలు, హత్యలు

## పారాహుషార్ తెలంగాణ..!!

ఇంట్లో పనివారిగా చేరడం.. యజమానుల కదలికలపై నిఘా పెట్టడం.. భద్రతా లోపాలను గుర్తించడం.. సహచరులతో కలిసి దాడి చేసి దోచుకోవడం.. ఆపై పరారవడం! హైదరాబాద్‌లో వెలుగుచూస్తున్న కొన్ని నేరాల్లో నేపాల్‌కు చెందిన నిందితులు అనుసరిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పద్ధతి ఇది. వృద్ధులను కట్టేసి, మత్తుమందు ఇచ్చి, అడ్డొస్తే హత్య చేసేందుకు కూడా వెనుకాడని ఘటనలు నగరవాసుల్లో భయాందోళనలు పెంచుతున్నాయి. కోట్లాది రూపాయల విలువైన నగలు కొల్లగొడుతున్న ముఠాలను కట్టడి చేయడంలో నిఘా వ్యవస్థలోని లోపాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- ఏడాదిలో హైదరాబాద్‌లో వరుస నేరాలు..
- కోట్లాది రూపాయల దోపిడీలు
- పనివారిగా చేరి నిఘా.. మత్తుమందు , ఆపై దోపిడీ, హత్యలు
- ఆరేళ్ల నుంచి ఎనిమిదేళ్ల నాటి 60 కేసులపై ప్రత్యేక దర్యాప్తు



హైదరాబాద్ (జనంసాక్షి): భారత్ - నేపాల్ మధ్య పాస్ పోర్టు, వీసా లేకుండా రాకపోకలకు ఉన్న వెసులుబాటు నేర దర్యాప్తులో సవాలుగా మారుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ సౌకర్యం నేరం చేసి తప్పించుకునేందుకు చట్టబద్ధమైన అనుమతి కాదు. నిందితులను గుర్తించడం, సరిహద్దులు దాటిన వారిని పట్టుకోవడం, ఇతర దేశ పోలీసులతో సమన్వయం సాధించడం దర్యాప్తు సంస్థలకు కీలకంగా మారుతోంది. నేరం చేసి పారిపోతే తప్పించుకోవచ్చనే ధీమాను నేరగాళ్లలో లేకుండా చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

మిగతా 2లో..

# రాష్ట్రంలో భారీ వర్షాలు

## పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ..



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో రేపు, ఎల్లుండి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు.వర్షాలు లేక ఎండిపోతున్న పంటలు చూసి అల్లాడుతున్న రైతులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రేపు, ఎల్లుండి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. రేపు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.ఎల్లుండి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్ బాద్ జిల్లాల్లో అతిభారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

మిగతా 2లో..

## తీవ్ర తుపానుగా 'అర్నబ్'

మంగళవారం నాటికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుంది: వాతావరణ శాఖ

2లో..

### రాజీనామా చేసి, వేరే పార్టీలో చేరడం

# రాజకీయ ప్రక్రియలో భాగమే..

### కోర్టుల్లో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాజీనామాలను ఆమోదించే అధికారం స్పీకర్‌కు ఉంటుంది : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి):తమిళనాడులో ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, అధికార టీవీకేలో చేరిన కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. వేరే పార్టీకి వెళ్లాలనుకున్న వారు రాజీనామా చేసే వెళ్తారని.. అది రాజకీయ ప్రక్రియలో భాగమని స్పష్టం చేసింది. రాజీనామా, అనర్హత వేటు అనేవి వేర్వేరు రాజ్యాంగ ప్రక్రియలు అని.. వాటిపై పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాజీనామాలను ఆమోదించే అధికారం స్పీకర్‌కు ఉంటుందని తెలిపింది. అనర్హత పిటిషన్

మిగతా 2లో..



జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 27.10.2026

## గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

తీసుకొస్తున్నదెంత? దేవాదుల, కల్వకుర్తి పంపుల వాడకంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. కన్నెపల్లి వద్ద నీళ్లను అవకాశం ఉన్నా ఎందుకు ఎత్తిపోయలేదు. ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరవే.ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రకు వెళ్లారు. మేం 2014లో ప్రభుత్వంలోకి వచ్చిన 42 రోజుల్లోనే ఆ రాష్ట్రంతో చర్చలు జరిపాం. కానీ, రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల తర్వాత చర్చలు జరిపారు. మూడేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు మహారాష్ట్ర వెళ్లారు” అని హరీశ్‌రావు అన్నారు.

## మోదీకి చెప్పండి

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పండి. అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి” అని వ్యాపారులను ఉద్దేశించి రాహుల్ గాంధీ పేర్కొన్నారు.దీపావళి పండగ సీజన్‌లో దిల్లీలో పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని ‘ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ’ పేర్కొంది. అయితే, నవంబరు 1న చేపట్టే నిరసన కారణంగా రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడొచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 10 తర్వాత నిరసనను నిర్వహించాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసింది.

## రాహుల్ గాంధీ కాన్వాయ్‌కి ప్రమాదం

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఉత్తరప్రదేశ్‌లో ఆయన ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లోని వాహనాలు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాహుల్ సురక్షితంగా బయట పడగా.. పలువురు కార్యకర్తలు, భద్రతా సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ ఘటన చోటుచేసుకుంది. పరువునష్టం కేసులో విచారణ నిమిత్తం ప్రత్యేక కోర్టుకు హాజరయ్యేందుకు రాహుల్ ఈ ఉదయం లఖ్‌నవూ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సుల్తాన్‌పూర్ బయల్దేరారు. మధ్యలో పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తుండగా.. కాన్వాయ్‌లో చివర ఉన్న ఐదు వాహనాలు, ఒక అంబులెన్స్ పరస్పరం ఢీకొన్నాయి. దీంతో వాటిల్లో ప్రయాణిస్తున్న కార్యకర్తలు, భద్రతా సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు. రాహుల్ కూర్చున్న వాహనానికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఘటన సమయంలో కాన్వాయ్ వేగంగా వెళ్తోందని, అందులోని ఓ వాహనం ఉన్నట్టుండి సడెన్ బ్రేక్ వేయడం వల్ల మిగతా వాహనాలు ఢీకొన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా.. ఇది స్వల్ప ప్రమాదమేనని, ఘటన తర్వాత రాహుల్ తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగించారని అధికారులు వెల్లడించారు.

## పరువునష్టం కేసులో రాహుల్‌కు ఊరట..

న్యూఢిల్లీ(జనంసాక్షి):మరోవైపు ఈ పరువునష్టం కేసులో రాహుల్‌కు ఊరట లభించింది. ఈ కేసును సుల్తాన్‌పూర్ ప్రత్యేక కోర్టు కొట్టేసింది. 2018 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో నాటి భాజపా జాతీయాధ్యక్షుడు, ప్రస్తుత కేంద్రమంత్రి అమిత్ షాపై రాహుల్ విమర్శలు గుప్పించారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి భాజపాకు నాయకత్వం వహిస్తున్నారని ఆరోపించారు. 2005నాటి సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును ఉటంకిస్తూ రాహుల్ ఆరోపణలు చేశారు. అయితే, అప్పటికే ఆ కేసులో అమిత్ షాపై అభియోగాలను సీబీఐ ప్రత్యేక కోర్టు కొట్టేసింది.దీంతో అమిత్ షా పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేశారంటూ సుల్తాన్‌పూర్‌కు చెందిన భాజపా నేత విజయ్ మిశ్రా చేసిన ఫిర్యాదు మేరకు రాహుల్‌పై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి వ్యక్తిగత విచారణకు హాజరయ్యేందుకే రాహుల్ నేడు యూపీకి వెళ్లారు. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన న్యాయస్థానం.. రాహుల్‌పై కేసును కొట్టేస్తూ తీర్పు వెలువరించింది.

## మేం చేసే ఆందోళన ప్రజల కోసమే..

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే డిమాండుతో నవంబరు 1న మెగా ర్యాలీకి పిలుపునిచ్చింది కాంగ్రెస్. అయితే, పండగ వేళ ఈ ఆందోళన కారణంగా తాము నష్టపోతామని, ర్యాలీని వాయిదా వేసుకోవాలని దేశ రాజధానిలో వ్యాపార సంఘాలు అభ్యర్థించిన సంగతి తెలిసిందే. దీనికి కాంగ్రెస్ సానుకూలంగా ఉన్నట్లు కన్పిస్తోంది. వ్యాపారుల అభ్యర్థనపై అతి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం వెల్లడించారు. “దిల్లీలో నవంబరు 1న ర్యాలీని షెడ్యూల్ చేశాం. దీనిపై వర్తక సంఘాలు అప్పీల్ చేశాయి. వారి అభ్యర్థనపై ఈరోజు లేదా రేపటిలోగా పార్టీ నాయకత్వం చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటుంది. మేం చేసే ఈ ఆందోళన ప్రజల కోసమే. ఓటు చోరీ అనేది చాలా తీవ్రమైన అంశం. ప్రజలకు ఓటు వేసే హక్కు లేకపోతే.. ఏ వర్తకుడు కూడా వ్యాపారం చేసుకోలేరు. భవిష్యత్తు కోసం కలలు కనే విద్యార్థులకు ఎలాంటి సాయం అందదు. అందుకే ఈ మెగా ర్యాలీకి పిలుపునిచ్చాం. అయినప్పటికీ, వ్యాపార సంఘాల అభ్యర్థనను మేం పరిగణనలోకి తీసుకుంటాం” అని ఖర్గే వివరించారు. దిల్లీలోని రామ్‌లీలా మైదానం వరకు ఈ ర్యాలీ చేపట్టాలని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందులో దాదాపు 10లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. దీంతో దిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. అయితే, దీపావళి సీజన్ సమయంలో ఈ ర్యాలీ నిర్వహించడం వల్ల తమ వ్యాపారా లకు నష్టం జరిగే ప్రమాదం ఉందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాఫిక్ మళ్లింపులు, ఇతర కారణాలతో ఆ ఒక్కరోజే తాము రూ.3 వేల కోట్ల మేర నష్టపోయే అవకాశం ఉందని పేర్కొంది. నవంబరు 10 వరకు ఈ ర్యాలీని వాయిదా వేయాలని అభ్యర్థిం చింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ పంపారు. రామ్‌లీలా మైదానానికి చుట్టుపక్కల 5 కిలోమీటర్ల పరిధిలోనే దాదాపు 20 అతిపెద్ద హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయి. చాందీని చౌక్, సర్దార్ బజార్, చావిడీ బజార్, కరోల్ బాగ్ వంటి మార్కెట్లలో పండగ సీజన్‌లో విపరీతమైన రద్దీ ఉంటుంది.

## గోదావరి జలాలపై దుష్ప్రచారం సరికాదు

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఎంపీ తెలిపారు. ఈ నెల 28న భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశానికి అన్ని పార్టీలు హాజరై నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు.

## ఖర్గే వ్యాఖ్యలను ఖండిస్తూ.. దేశవ్యాప్తంగా భాజపా నిరసనలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్య తీవ్ర దుమారం రేపింది. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ.. భాజపా సోమవారం దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. దేశంలోని అన్ని పార్టీ ప్రధాన కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించింది. బిహార్, జమ్మూ కశ్మీర్, దిల్లీ, ముంబయి, పట్నా, రాంచీ, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల్లో భాజపా పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించింది. ఆ పార్టీ కార్యకర్తలు ఖర్గేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. రాజ్యసభలో ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పలు ప్రదేశాల్లో కాంగ్రెస్ అధ్యక్షుడి దిష్టిబొమ్మలను తగలబెట్టారు. ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ఖర్గే ప్రధాని మోదీ గురించి అటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

# ‘మహా’ చర్చలు సఫలం



తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంపు అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో చర్చలు చాలా ఫలవంతంగా ముగిశాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి తమ ప్రతిపాదనను పెద్ద హృదయంతో పరిశీలించారని ఫడణవీస్‌కు కృతజ్ఞతలు చెప్పారు. సాంకేతిక అంశాలతో పాటు ముంపు అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీ ఏర్పాటు చేసేందుకు ఇరువైపులా అంగీకారం కుదిరిందని అన్నారు. మహారాష్ట్ర, అక్కడి ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటూనే జాతీయ దృక్పథంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ప్రత్యేకించి గిరిజనుల జీవితాలను మార్చేందుకు తన వంతు సహకరిస్తానని ఫడణవీస్ హామీ ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి రాష్ట్ర ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. సమావేశం ప్రారంభంలో ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన ఆయన సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను పేర్కొన్నారు.ఆదిలాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి లేదని తెలిపారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందన్న ఆయన ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని వివరించారు. 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమని, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అక్కడ అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. వెనుకబడిన అటవీ ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొన్నారు. కుమురం భీం సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాట కాలం నుంచి ఆ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదన్న రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నా సీఎం రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్న ఆయన పరస్పర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.రాష్ట్ర ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన దేవేంద్ర ఫడణవీస్ తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోమారు పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర సీఎం తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.

**ప్రతికూల ప్రభావం లేకపోతే**

మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని ఫడణవీస్ తెలిపారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు.పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయంలో కేంద్ర జలసంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని అన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని అన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించి ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం**

దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్?లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్?ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఫడ్నవీస్ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

## రాజీనామా చేసి, వేరే పార్టీలో చేరడం రాజకీయ ప్రక్రియలో భాగమే

విచారణను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఆరుగురు ఎమ్మెల్యేల రాజీనామాలు, పార్టీ మార్పుపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. పార్టీ మారిన ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను ఐదేళ్లపాటు అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పార్టీ నేతలు ఇటీవల మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో, ఎన్నికల సంఘం, తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారికి ఒక ఆదేశం జారీ చేయాలని కోరారు. దీని ప్రకారం, స్వచ్ఛందంగా రాజీనామా చేసిన ఎమ్మెల్యే, ఆ రాజీనామా వల్ల ఏర్పడే ఉప ఎన్నికలో తిరిగి పోటీ చేయాలనుకుంటే.. దాని నిర్వహణకు అయ్యే ప్రభుత్వ వ్యయంతో సమానమైన మొత్తాన్ని ముందుగా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించిన తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని సమర్థించింది.

## రక్షణ రంగానికి భారీ ఊతం..

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.2.12 లక్షల కోట్ల వ్యయంతో సైనిక సామగ్రి కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన ‘రక్షణ కొనుగోళ్ల మండలి’ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. తేలికపాటి మల్టీరోల్ హెలికాప్టర్లు, దీర్ఘశ్రేణి ఆత్మాహుతి డ్రోన్లు, రాడార్ల వంటివి ఇందులో ఉన్నాయి. ఈ కొనుగోళ్లలో 82 శాతం దేశీయంగానే చేయనున్నారు.భారత సైన్యం కోసం తేలికపాటి మల్టీరోల్ హెలికాప్టర్లు, అతి స్వల్పశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ దీర్ఘశ్రేణి ఆత్మాహుతి డ్రోన్ల వంటి ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు డీఏసీ ఆమోదముద్ర వేసింది. నౌకాదళం కోసం ‘యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్’ ఇతర వ్యవస్థల కొనుగోలుకు ఆమోదం లభించింది. శత్రువుల నౌకా విధ్వంసక క్షిపణుల నుంచి రక్షణ కల్పించడంలో ఏఓడీఎస్ సాయపడుతుందని రక్షణశాఖ తెలిపింది.

## ఇక కౌంటర్ టికెట్లకూ 45 పైసలకే రూ.10 లక్షల బీమా

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారతీయ రైల్వే ప్రయాణికులందరికీ ట్రావెల్ ఇన్సూరెన్స్ స్కీమ్ వర్తించనుంది ఇప్పటివరకు కేవలం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు మాత్రమే ట్రావెల్ ఇన్సూరెన్స్ ఆప్షన్ ఉండేది. ఇకపై ఆఫ్‌లైన్‌లో రైల్వే కౌంటర్ల వద్ద టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులకూ ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు భారతీయ రైల్వేను ఆదేశించింది. అక్టోబర్ 27 నుంచి అమల్లోకి తేవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ప్రయాణికుడు టికెట్‌పై 45 పైసలు అదనంగా చెల్లిస్తే రూ.10 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. ఇది కేవలం ప్రయాణికుడి ఆప్షన్ మాత్రమే, తప్పనిసరి కాదు. యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ రాధా యాదవ్ కేసులో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇన్సూరెన్స్‌లో భాగంగా రైలు ప్రమాదం లేదా ఇతర అవాంఛనీయ సంఘటనల వల్ల ప్రయాణికుడు మరణించినా లేదా తీవ్రంగా గాయపడి శాశ్వత అంగవైకల్యానికి గురైనా గరిష్ఠంగా రూ.10 లక్షల బీమా వస్తుంది. శాశ్వతంగా పాక్షిక అంగవైకల్యం బారిన పడితే.. రూ.7.5 లక్షల పరిహారం అందుతుంది. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు, మృతదేహాన్ని తరలించేందుకు రూ.10 వేలు చెల్లిస్తారు. అయితే ఈ ప్రీమియం తీసుకునే ప్రయాణికులు కచ్చితంగా మొబైల్ నంబరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రీమియాన్ని డిజిటల్ పేమెంట్ పద్ధతిలోనే చెల్లించాల్సి ఉంటుంది. టికెట్ ఛార్జీలతో కలిసి దీన్ని వసూలు చేస్తారు. నమోదు చేసుకున్న ఫోన్ నంబరుకు బీమా వివరాలు అందుతాయి.

# పాస్‌పోర్ట్ అక్కర్లేదు.. నేరం చేసి పారిపోవచ్చు!

### కోట్లలో దోపిడీలు.. వరుస ఘటనలు

**కర్మానా, నవంబర్ 2025:** రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ డి.కె. గిరిని కట్టేసి దాడి చేసి, 23 తులాల బంగారం, రూ.95 వేల నగదు దోచుకెళ్లినట్లు కేసు నమోదైంది. ఐదుగురిని అరెస్టు చేశారు.

మలక్‌పేట, డిసెంబర్ 2025: పనివారిగా చేరిన నేపాల్‌కు చెందిన దంపతులపై వ్యాపారి ఇంట్లో నగదు, నగల చోరీకి సంబంధించి ఆరోపణలు వచ్చాయి.

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 2026 :** సుమారు రూ.1.3 కోట్ల విలువైన నగల చోరీ కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి.

**నందగిరి హిల్స్, ఫిబ్రవరి 2026 :** పుట్టినరోజు వేడుక పేరుతో పానీయాల్లో మత్తుమందు కలిపి, సహచరులతో కలిసి రూ.20 లక్షల విలువైన నగలు, నగదు దోచుకెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి.

**మార్చి 2026 :** పనివారిగా చేరిన దంపతులు, మరో వ్యక్తి సహకారంతో రూ.2 కోట్ల విలువైన నగలు దోచుకెళ్లినట్లు కేసు వెలుగులోకి వచ్చింది.

**జూబ్లీహిల్స్, మే 8, 2026 :** విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ రంజన్ హత్య కేసులో ఇంట్లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన మహిళ, ఆమె సహచరులపై ఆరోపణలు నమోదయ్యాయి.

**కౌకూర్, మే 2026 :** వృద్ధ దంపతులను కట్టేసి, మత్తుమందు ఇచ్చి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లిన ఘటన వెలుగులోకి వచ్చింది.

**గచ్చిబౌలి, జూన్ 2026 :** హిల్‌రిడ్జ్ విల్లాస్‌లో సుమారు రూ.10 కోట్ల విలువైన నగల చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి, భారీగా బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలు తెలిపాయి.

### ముఠాల వ్యూహం.. భద్రతకు సవాలు

ఇంట్లో ఉద్యోగం సంపాదించడం వీరి నేరానికి ప్రవేశ ద్వారంగా మారుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. యజమానుల దినచర్య, నగల నిల్వ, ఇంటి ప్రవేశ మార్గాలు, సీసీ కెమెరాల అమరికపై అవగాహన పెంచుకుని, అనువైన సమయంలో సహచరులను రంగంలోకి దింపుతున్నట్లు కొన్ని కేసుల్లో దర్యాప్తు వివరాలు సూచిస్తున్నాయి. దోపిడీ తర్వాత రాష్ట్రాల మధ్యకు, కొందరు నేపాల్‌కు పారిపోయేందుకు ప్రయత్నించడం పోలీసులకు మరో సవాలుగా మారుతోంది.

### 60 కేసులు.. సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలెన్నో..

నేపాల్ జాతీయులకు సంబంధించి గత ఆరు నుంచి ఎనిమిదేళ్లలో నమోదైన సుమారు 60 కేసులపై దృష్టి సారించేందుకు హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వార్తలు వెలువడాయి. ఇన్ని కేసులు ఎందుకు పేరుకుపోయాయి? గతంలో నేరాలకు పాల్పడినవారు కొత్త పేర్లతో, కొత్త ప్రాంతాల్లో మళ్లీ ఉద్యోగాలు పొందకుండా ఎలాంటి వ్యవస్థ ఉంది? ప్లేస్‌మెంట్ ఏజెన్సీలపై పర్యవేక్షణ ఎంతవరకు ఉంది? పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడంలో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సమన్వయం ఎంత సమర్థంగా పనిచేస్తోంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం.

### ఇకనైనా కఠిన నిఘా తప్పనిసరి

పనివారి నియామకంలో పోలీసు ధ్రువీకరణను తప్పనిసరిగా ప్రోత్సహించాలి. ప్లేస్‌మెంట్ ఏజెన్సీల రికార్డులను తనిఖీ చేయాలి. గత నేరచరిత్రను చట్టబద్ధంగా పరిశీలించే వ్యవస్థను బలోపేతం చేయాలి. వృద్ధులు ఒంటరిగా నివసించే ఇళ్లకు భద్రతా చర్యలు, అత్యవసర సహాయ వ్యవస్థలు అందుబాటులో ఉండాలి. నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులు ఎక్కడికి పారిపోయినా చట్టం ముందు నిలబెట్టాలి. కొందరు వ్యక్తుల నేరాలను మొత్తం నేపాల్ సమాజానికి ఆపాదించకుండా, ఆధారాల ఆధారంగా దర్యాప్తు జరగాలి. భయాందోళనలు కాదు.. సమర్థమైన పోలీసు నిఘా, జవాబుదారీతనం, వేగవంతమైన న్యాయప్రక్రియే ప్రజలకు భరోసా ఇవ్వగలవు.

## రాష్ట్రంలో భారీ వర్షాలు

గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం అర్నాబ్ తుఫాను సాయంత్రానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉంది. అనంతరం, రేపటికి అదే ప్రాంతంలో అతి తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉంది. ఆ తరువాత ఈ తుఫాను వాయువ్య దిశగా కదులుతూ, ఎల్లుండి ఉదయం నుంచి మధ్యాహ్నానికి ముందు సమయంలో ఏపీలోని బాపట్ల, విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో ఇది అతి తీవ్ర తుఫానుగా ఉండే అవకాశం ఉంది. ఆ సమయంలో గరిష్ఠంగా నిరంతర గాలుల వేగం గంటకు 115?125 కి.మీ. ఉండవచ్చు. గాలుల వేగం అప్పుడప్పుడు గంటకు 140 కి.మీ. వరకు పెరిగే అవకాశం ఉంది.

**అప్రమత్తమైన టీజీఎస్‌పీడీసీఎల్**

తుఫాను ప్రభావంపై టీజీఎస్‌పీడీసీఎల్ అప్రమత్తమైంది. అత్యవసర మరమ్మతులకు సిబ్బంది, సామగ్రి సిద్ధం చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి.పాటిల్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేశ్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయకుండా, అత్యవసర విధులకు అందుబాటులో ఉండాలని సూచించారు.విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది, వాహనాలు, మరమ్మతు సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో వేగంతో పాటు భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకవద్దని, వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## తీవ్ర తుపానుగా ‘అర్నబ్’

**మంగళవారం నాటికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుంది:వాతావరణ శాఖ**

అమరావతి(జనంసాక్షి): బంగాళాఖాతంలో ఏర్పడిన ‘అర్నబ్’ తుపాను తీరం దిశగా దూసుకొస్తోంది. ఇవాళ అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మంగళవారం నాటికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 140 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. తుపాను ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్ష సూచన ఉంది. మంగళవారం కోస్తా తీరం వెంబడి 90కి.మీ-100కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.తుపాను నేపథ్యంలో.. చెట్లు, భారీ హోర్డింగ్‌లు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండొద్దని ప్రజలను వాతావరణశాఖ హెచ్చరించింది. ఏవైనా ఇబ్బందులుంటే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. అత్యవసర సహాయక చర్యల కోసం ప్రభావిత జిల్లాల్లో 7 ఔఆఖీఈ, 8 ాఆఖీఈ బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపింది. అత్యవసర సహాయం కోసం విపత్తుల సంస్థ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించవచ్చని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది.

**27, 28వ తేదీల్లో పాఠశాలలకు సెలవులు**

అర్నబ్ తుపాను తీవ్రత దృష్ట్యా ఏపీలోని వివిధ జిల్లాల్లో పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు అంగన్వాడీ కేంద్రాలకు సెలవులిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి వెల్లడించారు. మరోవైపు విశాఖ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలలకు మంగళ, బుధవారాల్లో సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ వెల్లడించారు.

## ఫతేనగర్‌లో ఈగల్ ఫోర్స్ సోదాలు..

**65 మందికి డ్రగ్స్ పాజిటివ్**

హైదరాబాద్(జనంసాక్షి):ఫతేనగర్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ బృందాలు దాడులు నిర్వహించాయి. ఎల్‌బీఎస్ నగర్‌లోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించి.. 75 ఏళ్ల షేక్ జతేన్ బీ అనే మహిళను అరెస్టు చేశారు. ఆమె ఇంట్లోని 179.1 గ్రాముల గంజాయి, రూ.43,340 నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కొనుగోలు కోసం 70 మంది వచ్చినట్లు గుర్తించి పరీక్షలు నిర్వహించగా.. 65 మందికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. వారిని డీ- అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన వారిలో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితురాలిపై గతంలోనూ గంజాయి సంబంధిత ఏడు కేసులు నమోదైనట్లు గుర్తించారు. మరో ఐదుగురు అనుమానితులు మున్నీ బేగం, ఇమ్రాన్, హనీఫా బీ, ఖాజా బీ, ఖాజా పాషా కోసం ఈగల్ పోలీసులు గాలిస్తున్నారు. గంజాయి సరఫరా మూలాలు, నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ రెపరెపలు ఖాయం

- ఎంపీ వద్దిరాజు ధీమా



**భద్రాద్రి కొత్తగూడెం (జనంసాక్షి) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తంచేశారు. అయితే ఇందుకోసం మనమందరం మరింత కృతనిశ్చయంతో ముందుకు సాగాల్సి ఉందని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. శాసనమండలిలోని నల్లగొండ-ఖమ్మం-వరంగల్, హైదరాబాద్-మహబూబ్ నగర్-రంగారెడ్డి పట్టభద్రుల నియోజక వర్గాలకు వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజ్యసభ సభ్యులు,ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇంఛార్జి వద్దిరాజు రవిచంద్ర,ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు,పార్టీ నాయకుడు రాకేష్ రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగే ఎన్నికల్లో ప్రతి సారి ఓటర్ల నమోదు జరగాల్సి ఉంటుందన్నారు. ఓటర్ల నమోదు ఎంత ఎక్కువ మందిని చేస్తే అంత మంచిదని, విజయం సాధించడం మరింత సులువు అవుతుందని పేర్కొన్నారు. 'మీకు అప్పగించిన చోట ప్రతి ఇల్లిల్లు కాలినడకన తిరిగి పట్టభద్రులను గుర్తించి వారి ఓటును తప్పకుండా నమోదు చేయించాలి"అని ఎంపీ రవిచంద్ర సూచించారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత, అధ్యాపకులు, డాక్టర్లు,రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయులు, న్యాయవాదులు, ఎల్ఐసి ఏజెంట్లు,పీజీ, పీహెచ్డీ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు,మాజీ సైనికోద్యోగుల వద్దకు స్వయంగా వెళ్లి వారి పేర్లను నమోదు చేయించాల్సిందిగా నాయకులకు పలు సలహాలిచ్చారు.ఎన్నికల సంఘం విడుదల చేసిన ఫారం -18ని పూరించి నవంబర్ 6వతేదీ లోగా ఓట్లను నమోదు చేయించాల్సి ఉంటుందని ఎంపీ రవిచంద్ర తెలిపారు.ఈ విషయంలో గడువుకు ముందునుంచే మరింత చురుగ్గా వ్యవహరించాలని,ఏ మాత్రం అలసత్వం వహించకుండా,నిర్లక్ష్యం చేయకుండా ఓట్ల నమోదును ముమ్మరంగా కొనసాగించాలని దిశానిర్దేశం చేశారు. నమోదు చేసిన ఓట్లను పార్టీ యాప్ లోకి విధిగా అప్ లోడ్ చేయాల్సిందిగా ఆయన చెప్పారు.పార్టీ కోసం క్రమశిక్షణతో, అంకితభావంతో పని చేసిన వారికే పదవులు లభిస్తాయని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

# మట్టిలో మాణిక్యం రెజ్లింగ్ క్రీడాకారిని దుగ్గొండి సహస్ర




- జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు దుగ్గొండి విద్యార్థిని
- విద్యార్థిని సన్మానించిన వరంగల్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజ్ కుమార్

**దుగ్గొండి, అక్టోబర్ 26 (జనం సాక్షి):** గ్రామీణ ప్రాంతాలలో మట్టిలో మాణిక్యం లాంటి విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాలను వెలికితీస్తూ మట్టిలో మాణిక్యంలా వెలుగు అందుతున్నారని వరంగల్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శానబోయిన రాజకుమార్ అన్నారు. సోమవారం దుగ్గొండి హైస్కూల్లో జాతీయస్థాయికి ఎంపికైన రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించి క్రీడా నైపుణ్యాన్ని ప్రసాదిక్షించిన యాదగిరి సహస్రను మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ పలువురు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సహస్ర సేవలను కొనియాడుతూ ఆమెను ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ లో దుగ్గొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థిని యాదగిరి సహస్ర 33కేజీ ల విభాగంలో రాష్ట్ర స్థాయి లో బంగారు పతకం సాధించి ఢిల్లీ లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. దుగ్గొడి మండల కేంద్రంలో ని ఉన్నత పాఠశాల లో ప్రధాన ఉపాధ్యాయులు రామస్వామి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితి గా హాజరైన రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శానబోయిన రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి లో క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయి లో ఉంటారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు రామ స్వామి మాట్లాడుతూ దుగ్గొండి ఉన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయి లో పతకం సాధించి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన సహస్ర ను అభినందించిన అనంతరం శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ తోకల నర్సింహా రెడ్డి,రెజ్లింగ్ జిల్లా భాద్యులు, యాదగిరి సుధాకర్, స్థానిక సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్, ఉప సర్పంచ్ పల్లె వైష్ణవి శ్యామ్,గుండెకారి రవికుమార్, కూస రమేష్, యాదగిరి మధు కోచ్ లు కందికొండ రాజు, దేవేందర్, ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఐదుగురు సభ్యులతో టీపీసీసీ సమన్వయ కమిటీ

- 'ఓట్ బచావో - దేశ్ బచావో' మెగా నేషనల్ ర్యాలీ విజయవంతానికి ఏర్పాటు
- ఐదుగురు ప్రజాప్రతినిధులకు బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1, 2026న నిర్వహించనున్న 'ఓట్ బచావో – దేశ్ బచావో' మెగా నేషనల్ ర్యాలీ కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ ఐదుగురు సభ్యులతో కూడిన సమన్వయ కమిటీని నియమించారు. ఈ జాతీయ ర్యాలీకి తెలంగాణ నుంచి హాజరయ్యే నాయకులకు ప్రయాణం, వసతి, ఇతర అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు సంబంధిత ఏర్పాట్లను సమర్థవంతంగా సమన్వయం చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, వాకిటి శ్రీహరి ముదిరాజ్ లు, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, పి. బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డిలను మహేష్ కుమార్ నియమించారు. జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ ర్యాలీకి సంబంధించి తెలంగాణ నుంచి పాల్గొనే నాయకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం, ప్రయాణం మరియు వసతి అంశాల్లో సమన్వయంతో వ్యవహరించడం కోసం కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు.

# చెన్నూర్ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

- గోదావరి పుష్కరాల పనులు, పర్యాటక అభివృద్ధి, గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి.
- చెన్నూరులో 6 కోట్ల రూపాయల వ్యయంతో రోడ్డు విస్తరణ, సెంట్రల్ మీడియన్, లైటింగ్ ఏర్పాటుకు భూమి పూజ
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** చెన్నూర్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. భాస్కర్, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... చెన్నూరు పట్టణానికి నూతన రూపు తీసుకురావాలనే ఉద్దేశంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వ్యాపారుల సహకారంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరిగిందని, బైపాస్ రోడ్డును రికార్డు సమయం పూర్తి చేసామని తెలిపారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వ్యాపారులకు అండగా హామీ మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రస్తుతం 20 షాపుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, అర్హులైన వ్యాపారులకు మరో 50 షాపుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజారోగ్య-మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 5 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో పట్టణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ జంక్షన్ నుండి పెద్ద చెరువు (రావి చెట్టు) వరకు బి.టి. రోడ్డు విస్తరణ, రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం, సెంట్రల్ మీడియన్ నిర్మాణం, లైటింగ్ ఏర్పాటు, మహంకాళి ఆలయం నుండి జాతీయ రహదారి 63 (గోదావరి రోడ్డు) వరకు 3 కోట్ల 50 లక్షల రూపాయలతో సి.సి. రోడ్డు విస్తరణ, జాతీయ రహదారి 63 నుండి గోదావరి పుష్కర ఘాట్ వరకు 6 కోట్ల రూపాయల వ్యయంతో రోడ్డు విస్తరణ, సెంట్రల్ మీడియన్, లైటింగ్ ఏర్పాటు, పుష్కర ఘాట్ సమీపంలో 50 లక్షల రూపాయల వ్యయంతో క్రైమాస్ లైటింగ్ ఏర్పాటు కొరకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో చెన్నూర్ పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు 70 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, పుష్కరాల ఘాట్లకు వెళ్లే రహదారిపై ఇప్పటికే కొంతమేర సి.సి. రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

అనంతరం జైపూర్ మండలం వేలాల గ్రామంలో మల్లన్న స్వామిని దర్శించుకుని, గోదావరి తీరంలో నీటిపారుదల-ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 4 కోట్ల 25 లక్షల రూపాయల వ్యయంతో పుష్కర ఘాట్ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్, ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల కోసం 70 కోట్ల రూపాయలు, చెన్నూర్ లోని శివాలయ అభివృద్ధికి 17 కోట్ల రూపాయల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మొసళ్ల పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించి, గాంధారి మైసమ్మ ఆలయం తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. జైపూర్ పవర్ ప్లాంట్ విస్తరణ ద్వారా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. సింగరేణి సంస్థకు చెందిన ఆర్కే ఓసీ గని ప్రారంభంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మందమరిలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందించి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం సుమారు 70 మంది శిక్షణ పొందుతున్నారని, అర్హత సాధించిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ లో 100 పడకల ఆసుపత్రిని త్వరలో ప్రారంభించడం జరుగుతుందని, మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గంలో 12 వేల నుంచి 15 వేల ఇండ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని, ఇప్పటికే సుమారు 5 వేల ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వాతావరణ పరిస్థితులను ప్రజలందరూ సమిష్టిగా ఎదుర్కోవాలని, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రజాధనాన్ని సమర్థంగా వినియోగించాలని తెలిపారు.

# కమిటీ పేరుతో కాలయాపన చేయొద్దు

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అనంతుల మధు




**చివ్వెంల (జనంసాక్షి) :** కమిటీ పేరుతో కాలయాపన చేయొద్దని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అనంతుల మధు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్' 'సీఎం ఇంటి ముట్టడి" కార్యక్రమం సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ రాష్ట్ర కో -ఆర్డినేటర్ అనంతుల మధు, రాష్ట్ర నాయకులు బషీపంగు సునీల్‌లను చివ్వెంల ఎస్ఐ వెంకన్న ఆధ్వర్యంలో ముందస్తు అక్రమ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కో -ఆర్డినేటర్ అనంతుల మధు మాట్లాడుతూ క్రియాశీలకంగా ఉద్యమం లో పాల్గొన్నా ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారుడుని గుర్తించి, పేదరికం ప్రామాణికంగా తీసుకోని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. గత ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అవుతున్న పట్టించుకోకపోవడంతో వివిధ పోరాట రూపాలలో ఉద్యమించిన తరవాత తాము 9 మంది ఉద్యమకారులము రాష్ట్ర హైకోర్టు లో పిల్ దాఖాలు చేశామని, జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి ధర్మసానం ఫిబ్రవరి 23/2026న ఉద్యమకారులకు అనుకూల తీర్పు ఇచ్చారని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కోసం కేకే కమిటీ వేసి కాలయాపన చేయడం తప్పితే ఉద్యమకారులకు న్యాయం జరగడం లేదని, తొలి దశ ఉద్యమకారులు కనీస గుర్తింపు కూడా నోచుకోక పండుటకుల వలె నేల రాలుతున్నారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్య లతో మలి దశ ఉద్యమ కారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ ఉద్యమం లో క్రియాశీలకంగా పాల్గొన్నా ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారుడిని గుర్తించి, జీవించే హక్కు లో భాగంగా పేదరికం ప్రామాణికంగా ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారుడిని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వన్ని డిమాండ్ చేసారు.

# ఉద్యోగమిప్పిస్తానని డబ్బులు దోచి.. లైంగికదాడి

**ఘట్‌కేసర్ (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ మహిళ నుంచి రూ.4.5 లక్షలు వసూలు చేసి, ఆమెపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఉద్యోగం ఆశ చూపి డబ్బులు కాజేయడమే కాకుండా, బాధితురాలిపై దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మల్లాపూర్‌లోని బ్రహ్మపుత్ర కాలనీకి చెందిన 30 ఏళ్ల మహిళ టైలరింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. నాలుగు నెలల క్రితం భువనగిరికి చెందిన జగన్మోహన్‌తో ఆమెకు ఫోన్ ద్వారా పరిచయం ఏర్పడింది. తాను భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ మేనేజర్‌గా పనిచేస్తున్నానని జగన్మోహన్ ఆమెను నమ్మించాడు. మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, ఇందుకోసం ఉన్నతాధికారికి రూ.5 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన బాధితురాలు ఉద్యోగం వస్తుందనే ఆశతో రూ.4.5 లక్షలు సమకూర్చుకుంది.

సోమవారం కారులో వచ్చిన జగన్మోహన్.. బాధితురాలిని భువనగిరి మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్తానని చెప్పి ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవుషాపూర్‌లో ఉన్న శ్రీనిధి రిసార్ట్‌కు తీసుకెళ్లాడు. మార్గమధ్యలో ఆమె వద్ద ఉన్న రూ.4.5 లక్షలు తీసుకున్నాడు. రిసార్ట్‌లో ఉన్నతాధికారి ఉంటాడని చెప్పి ఓ గదిలోకి తీసుకెళ్లి ఆమెపై దాడి చేసి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు లో పేర్కొంది. అనంతరం ఆమెను కారులో ఎక్కించుకుని హైవే పైకి తీసుకెళ్లి కారు నుంచి కిందకి తోసేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తనకు జరిగిన మోసాన్ని గుర్తించిన బాధితురాలు ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి జగన్మోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం.



## ఈపీఎస్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి

# డిసెంబర్ 15, 16 తేదీల్లో చలో ఢిల్లీ

- కనీస పెన్షన్ రూ.9 వేలు, కరువు భత్యం చెల్లించాలని డిమాండ్



**హైదరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్) పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 15, 16 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మీడియా ఇన్‌చార్జి జి. అశోక్ వెల్లడించారు. ఈ మేరకు అక్టోబర్ 26న పుణెలోని మునిసిపల్ వర్కర్స్ అసోసియేషన్ భవనంలో డి. మోహనన్ అధ్యక్షతన ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ జాతీయ కార్యదర్శి అతుల్ దిగి కార్యకలాపాల నివేదికను సమర్పించారు. తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలకు చెందిన 30 మంది కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్‌ను నెలకు రూ.9 వేలకు పెంచడంతోపాటు కరువు భత్యం చెల్లించాలని కమిటీ డిమాండ్ చేసినట్లు అశోక్ తెలిపారు. అధిక పెన్షన్‌కు సంబంధించి న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను అమలు చేయాలని, అదనపు చెల్లింపులకు సంబంధించి డిమాండ్ నోటీసులు అందుకున్న ప్పటికీ సొమ్ము చెల్లించలేని పెన్షనర్లకు మరో అవకాశం కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణంలో రాయితీలను పునరుద్ధరించాలని, ఈపీఎస్ పెన్షనర్లకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కమిటీ డిమాండ్ చేసిందన్నారు. పెన్షన్ వాలిడిటీ బిల్లు-2025ను రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 15, 16 తేదీల్లో న్యూఢిల్లీలోని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు అశోక్ వెల్లడించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. నారాయణరెడ్డి, ఎన్. బ్రహ్మాచారి, బోనాల రామారావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లో చోరీలు

- తల్లీకూతుళ్ల అరెస్ట్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నేరస్థులను సికింద్రాబాద్ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 70 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.10.60 లక్షలుగా పోలీసులు అంచనా వేశారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన జమునా బ్యాద్ (38), మాలతి బ్యాద్ (20)లను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరూ తల్లీకూతుళ్లు కాగా, సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రయాణికులు రైళ్లలో ఎక్కే సమయంలో రద్దీని ఆసరాగా చేసుకుని మహిళలను లక్ష్యంగా చేసుకునేవారని, ఒకరు ప్రయాణికురాలి కదలికలను గమనిస్తూ ఉండగా, మరొకరు హ్యాండ్‌బ్యాగులు, లగేజీ బ్యాగుల జిప్పులు తెరిచి విలువైన వస్తువులను దొంగిలించేవారని వెల్లడించారు. నిందితులు గతంలోనూ పశ్చిమ బెంగాల్‌లో ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. సాయేశ్వర్ గౌడ్, ఎస్ఐ ఎస్.వి. సుబ్బారెడ్డి, ఇతర సిబ్బంది, ఆర్‌పీఎఫ్ అధికారుల సమన్వయంతో ఈ అరెస్టులు చేపట్టారు. రైల్వే పోలీస్ సూపరింటెండెంట్ వై. సాయి శేఖర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కేసు ఛేదనలో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని ఐజీపీ రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ కె. రమేష్ నాయుడు అభినందించారు. సిబ్బందికి తగిన ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

# చోరీకి వచ్చి దొరికిన దొంగ

**తిరుమలాయపాలెం (జనంసాక్షి) :** చోరీ చేసేందుకు వెళ్లి ఓ దొంగ విఫలయత్నం చేసి అడ్డంగా దొరికిన ఘటన సోమవారం తిరుమలాయపాలెం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం సమయంలో మండలంలోని కాకరవాయి గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య అనే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం పగలగొట్టి ఓ దొంగ ఇంట్లో చొరబడ్డాడు. సరిగ్గా అదే సమయంలో లింగయ్య ఇంటికి వెళ్లి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించాడు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడ్డారని అనుమానంతో వెనుక తలుపు, ముందు తలుపులకు గడియలు పెట్టి, సమీపంలోని వారిని లింగయ్య పిలిచాడు. వారు వచ్చి తలుపులు తెరిచి ఇంట్లో ఉన్న దొంగను బంధించి, కరెంటు స్తంభానికి తాడుతో కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పోగుల సురేష్ దొంగను తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆ దొంగ ఎంతకీ తన వివరాలు చెప్పలేదని స్థానికులు అన్నారు. ఈ ఘటన పై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# సహకార సమాఖ్యవాదానికి బలమైన పునాది

సంపాదకీయం

*ముంబయిలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం సమావేశమై తుమ్మిడిహెట్టి ఆనకట్ట అంశంపై చర్చించడం స్వాగతించ దగిన పరిణామం. దశాబ్దాలుగా నదీజలాల పంపిణీ అంటే వివాదా లు, న్యాయపోరాటాలు, ట్రిబ్యునళ్ల తీర్పులే అన్న భావన బలపడిన నేపథ్యంలో, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, సాంకేతిక అధికారులు ఒకే గదిలో కూర్చుని సమస్యను పరిష్కరించే దిశగా మాట్లాడుకోవడం భారత సమాఖ్య వ్యవస్థ పరిణతికి నిదర్శనం.*

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ ఎత్తు విషయంలో 2016లో కుదిరిన ఒప్పందం ప్రకారం దానిని 148 మీటర్లకు పరిమితం చేశారు. ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ ప్రాంత సాగునీటి అవసరాలు పూర్తిస్థాయి లో తీరవన్నది తెలంగాణ వాదన. అందుకే 152 మీటర్ల ఎత్తుకు సహకరించాలని కోరుతోంది. మహారాష్ట్రపై ప్రతికూల ప్రభావం లేకపోతే గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమ కు అభ్యం తరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఫడణవీస్ స్పష్టం చేయడం సానుకూల సంకేతం. ఈ ఒక్క షరతు ఆధారిత సుముఖతే చర్చలకు బాటలు వేసింది. తమ ప్రయోజనాలను కాపాడు కుంటూనే పొరుగు రాష్ట్ర అవసరాలను అర్థం చేసుకునే ధోరణే సమాఖ్య స్ఫూర్తికి ప్రాణం.

ఈ అంశంలో ఉన్న సున్నితత్వాన్ని విస్మరించకూడదు. ఎత్తు పెంచితే ముంపు ప్రభావం మహారాష్ట్ర భూభాగంపై పడుతుంది. అక్కడి ప్రజల భూములు, ఇళ్లు, జీవనోపాధి ప్రశ్నార్థకమవుతాయి. అందుకే కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కమిటీ వేసి అన్ని అంశాలనూ సమగ్రంగా పరిశీలించాలన్న ప్రతిపాదన కూడా సముచితం. ముంపునకు గురయ్యే ప్రాంతానికి సంబంధించిన ప్రత్యామ్నాయాలనూ అధ్యయనం చేయాలన్న సూచన కూడా ఆచరణాత్మకమే. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని తెలంగాణ కోరడం ఇక్కడ ప్రత్యేకంగా గమనించదగ్గది. నీటి లభ్యత, ముంపు ప్రభావం, పునరావాసం, పరిహారం, సాంకేతిక అంశాలపై శాస్త్రీయ అంచనాలే తుది నిర్ణయానికి ఆధారం కావాలి. భావోద్వేగాలు, రాజకీయ లబ్ధి కాదు.

రాజకీయంగా భిన్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం ప్రజల ప్రయోజనం కోసం కలిసి కూర్చోవచ్చని ఈ సమావేశం చాటింది. నదీజలాల వివాదాలు ఏళ్ల తరబడి సుప్రీంకోర్టు, ట్రిబ్యునళ్ల మెట్లెక్కి, ప్రాజెక్టుల వ్యయాన్ని పెంచి, రైతులకు నీరు అందకుండా చేసిన ఉదాహరణలు మన కళ్లెదుటే ఉన్నాయి. చర్చల ద్వారా పరిష్కారం కనుగొంటే సమయం, డబ్బు ఆదా అవడమే కాదు, రాష్ట్రాల మధ్య నమ్మకం కూడా పెరుగుతుంది. ఆ నమ్మకమే సమాఖ్య వ్యవస్థకు పెట్టుబడి.

అయితే సమావేశం జరగడం, సానుకూల స్పందన రావడం మొదటి అడుగు మాత్రమే. నిజమైన పరీక్ష ఇప్పుడు మొదలవుతుంది. కమిటీ నిర్ణీత కాలపరిమితిలో పారదర్శకంగా పనిచేయాలి. అధ్యయన నివేదికలను ఇరు రాష్ట్రాల ప్రజల ముందు ఉంచాలి. ముంపు బాధితులకు న్యాయమైన పునరావాసం, పరిహారంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలి. ఈ ప్రక్రియలో కేంద్రం తటస్థ మధ్యవర్తిగా, సాంకేతిక సహకారిగా వ్యవహరించాలి తప్ప అడ్డంకిగా మారకూడదు.

ఒక ప్రాజెక్టు కోసం జరిగిన ఈ చర్చ అక్కడితో ఆగిపోకూడదు. గోదావరి, కృష్ణా సహా ఇతర నదీజలాల వివాదాలకు కూడా ఇదే చర్చల మార్గం నమూనా కావాలి. పోటీ కాదు, సహకారమే రాష్ట్రాల బలమని, రాష్ట్రాల బలమే దేశ బలమని ఈ సమావేశం గుర్తు చేస్తోంది. ఇలాంటి చర్చలు కొనసాగి, ఆచరణలో ఫలితాలిచ్చినప్పుడే ఫెడరల్ స్ఫూర్తి కాగితాలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో కనిపిస్తుంది.

# బ్రెజిల్ తీర్పు: అతివాదానికి అడ్డుకట్ట

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు రాజకీయ అధికారాన్ని నిర్ణయించడమే కాదు, దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం కూడా చేస్తుంది. బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా సాధించిన చారిత్రాత్మక విజయం ఈ సత్యాన్ని మరోసారి నిరూపించింది. 2026 అక్టోబరు 25న జరిగిన రెండో విడత ఎన్నికల్లో ఆయన అతివాద కుడిపక్ష అభ్యర్థి ఫ్లావియో బోల్సొనారోను ఓడించి నాలుగోసారి దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు ప్రజల మద్దతు పొందారు. అయితే ఇది వరుసగా నాలుగో పదవీకాలం కాదు; గతంలో రెండుసార్లు, 2003–2010 మధ్య అధ్యక్షుడిగా పనిచేసిన లూలా, 2023లో తిరిగి అధికారంలోకి వచ్చి ఇప్పుడు మరోసారి విజయం సాధించారు.

బ్రెజిల్ సుప్రీం ఎన్నికల న్యాయస్థానం ప్రకటించిన తుది ఫలితాల ప్రకారం, లూలాకు 51.79 శాతం ఓట్లు, ఫ్లావియో బోల్సొనారోకు 48.21 శాతం ఓట్లు లభించాయి. లూలాకు 6.42 కోట్లకు పైగా ఓట్లు రాగా, ప్రత్యర్థికి సుమారు 5.98 కోట్ల ఓట్లు వచ్చాయి. దాదాపు 44 లక్షల ఓట్ల ఆధిక్యంతో లూలా విజయం సాధించారు. అక్టోబరు 4న జరిగిన తొలి విడత ఎన్నికల్లో ఫ్లావియో 47.03 శాతం ఓట్లతో ముందుండగా, లూలాకు 45.16 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. అయినప్పటికీ, రెండో విడతలో ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మలుచుకోవడం ఆయన రాజకీయ చతురతకు నిదర్శనం. 1989లో ప్రజాస్వామ్య ఎన్నికలు పునరుద్ధరించిన తరువాత తొలి విడతలో వెనుకబడిన అభ్యర్థి రెండో విడతలో గెలవడం ఇదే తొలిసారి.

ఈ విజయానికి ప్రధాన కారణం ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రగతిశీల శక్తులు ఏకతాటిపైకి రావడం. మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో 2022 ఎన్నికల్లో ఓటమి తరువాత తిరుగుబాటు కుట్రకు పాల్పడిన కేసులో 27 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఆయన కుమారుడు ఫ్లావియో తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ సంప్రదాయవాద ఓటర్లను సమీకరించారు. మరోవైపు, లూలా పేదరిక నిర్మూలన, సంక్షేమ పథకాలు, కార్మికుల హక్కులు, సామాజిక సమానత్వానికి ప్రాధాన్యమిచ్చారు. రెండో విడతలో ఓటర్ల హాజరు పెరిగి, గైర్హాజరు శాతం తొలి విడతలో 21.08 శాతం నుంచి సుమారు 19.2 శాతానికి తగ్గడం కూడా కీలకమైంది.

అయితే లూలా విజయాన్ని కేవలం సంక్షేమ రాజకీయాల విజయంగా చూడలేం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభావంతో లాటిన్ అమెరికాలో అనేక దేశాలు రైటిస్ట్ పార్టీ రాజకీయాల వైపు మొగ్గుతున్న సమయంలో బ్రెజిల్ భిన్నమైన తీర్పునిచ్చింది. వాణిజ్య ఒత్తిళ్లు, సుంకాల వివాదాల మధ్య అమెరికా ఆధిపత్యానికి తలొగ్గకుండా దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడతానన్న లూలా వైఖరి ఓటర్లను ప్రభావితం చేసింది. బ్రెజిల్ ఎవరికీ పెరటి ప్రాంగణం కాదన్న ఆయన సందేశం జాతీయ స్వాభిమానానికి ప్రతీకగా నిలిచింది. అయితే అమెరికాతో సంబంధాలను దెబ్బతీయకుండా ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడం ఆయన ముందున్న అసలైన పరీక్ష.

ఈ ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల పాత్ర కూడా తీవ్ర చర్చకు దారితీసింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల మాతృసంస్థ మెటా తన ప్రత్యర్థికి అనుకూలంగా వ్యవహరిస్తోందని లూలా ప్రచార బృందం ఆరోపించింది. కొన్ని ప్రచార ప్రకటనలు సాంకేతిక లోపాల కారణంగా నిలిపివేయబడ్డాయని మెటా అంగీకరించినప్పటికీ, ఉద్దేశపూర్వక పక్షపాత ఆరోపణలను తిరస్కరించింది. డిజిటల్ వేదికల అల్గారిథమ్‌లు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తున్నాయా, రాజకీయ ప్రకటనల్లో పారదర్శకత ఉందా అనే ప్రశ్నలు ఈ పరిణామంతో మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల ప్రక్రియను ప్రజాస్వామ్యబద్ధంగా ఉంచాలంటే డిజిటల్ సంస్థల జవాబుదారీతనం తప్పనిసరి.

మరోవైపు, ఓటింగ్ సమయాన్ని రెండు గంటలు పొడిగించడంపై వివాదం చెలరేగింది. రవాణా అంతరాయాలు, భారీ వర్షాల కారణంగా ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న అభ్యర్థనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఫ్లావియో ఫలితాలను అంగీకరించకుండా ఎన్నికలను రద్దు చేయాలని కోరుతానని ప్రకటించారు. ఇలాంటి ఆరోపణలను రాజకీయ ప్రచారంగా కాకుండా ఆధారాలతో, చట్టబద్ధమైన విచారణ ద్వారా పరిష్కరించాలి.

లూలా ముందున్న సవాళ్లు చిన్నవేమీ కావు. అధిక జీవన వ్యయం, నేరాలు, ఆర్థిక అసమానతలు, రాజకీయంగా విభజితమైన సమాజం, కుడిపక్ష ఆధిపత్యంలో ఉన్న పార్లమెంటు ఆయన పాలనకు పరీక్షగా నిలవనున్నాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడతానన్న హామీ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచినప్పుడే సార్థకమవుతుంది.

బ్రెజిల్ ఎన్నికల సందేశం స్పష్టం: ప్రజాస్వామ్యంలో అతివాదాన్ని ఓడించడం ఒక ముందడుగు మాత్రమే; ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం అసలైన విజయం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# సమాజం-ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి!

**కరువు ముప్పు వేళ పొదుపే రక్షణ.. బాధ్యతాయుత వ్యయమే పాలనకు పరీక్ష!**

ప్రకృతి వైపరీత్యాలు మానవ జీవితాన్ని పరీక్షిస్తున్నప్పుడు సమాజానికి అవసరమయ్యేది కేవలం ఆర్థిక సంపద మాత్రమే కాదు.. ఉన్న సంపదను వివేకంతో వినియోగించే క్రమశిక్షణ కూడా. వర్షాభావం, కరువు, తాగునీటి కొరత, వ్యవసాయ సంక్షోభం, ఆహార పదార్థాల ధరల పెరుగుదల వంటి పరిణామాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయి. వీటిని ముందుగానే అంచనా వేసి ప్రజలు పొదుపు అలవాట్లను పెంపొందించుకోవడం, ప్రభుత్వం ప్రజాధనాన్ని బాధ్యతాయుతంగా ఖర్చు చేయడం అత్యంత అవసరం. ఆర్థిక క్రమశిక్షణ అనేది కేవలం వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశం కాదు. అది కుటుంబాల మనుగడకు, వ్యవసాయ రంగ స్థిరత్వానికి, ప్రభుత్వ ఆర్థిక ఆరోగ్యానికి, దేశ సమగ్ర అభివృద్ధికి పునాది.

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, అసమాన వర్షపాతం, కొన్ని ప్రాంతాల్లో దీర్ఘకాలిక కరువు, మరికొన్ని ప్రాంతాల్లో అతివృష్టి వంటి పరిణామాలు ఆహార ఉత్పత్తి వ్యవస్థలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్నప్పుడు వాటి ప్రభావం మొదట వ్యవసాయ రంగంపై కనిపిస్తుంది. పంటల దిగుబడులు తగ్గడం, సాగునీటి లభ్యత క్షీణించడం, పశువులకు మేత కొరత ఏర్పడడం, వ్యవసాయ కూలీలకు పని దొరకకపోవడం వంటి పరిణామాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తాయి. ఈ పరిస్థితి గ్రామాలకే పరిమితం కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం తగ్గినప్పుడు పట్టణాల్లోని వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు, రవాణా, సేవారంగాలపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది.

కరువు అంటే కేవలం వర్షాలు లేకపోవడం కాదు.. ప్రజల ఆదాయం, ఆహార భద్రత, ఉపాధి అవకాశాలు, జీవన ప్రమాణాలు దెబ్బతినే సమగ్ర ఆర్థిక సంక్షోభం. అందువల్ల కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు, ప్రజలు విడివిడిగా కాకుండా సమన్వయంతో వ్యవహరించాలి.

**వ్యవసాయ సంక్షోభం.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సవాలు**

భారతదేశంలో వ్యవసాయం కోట్లాది కుటుంబాలకు జీవనాధారం. రైతు పంట పండిస్తేనే వ్యవసాయ కూలీకి పని లభిస్తుంది. పంట దిగుబడులు వస్తేనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు విక్రయించే వ్యాపారాలకు గిరాకీ పెరుగుతుంది. పంటల ద్వారా ఆదాయం లభించినప్పుడే గ్రామీణ కుటుంబాలు దుస్తులు, గృహోపకరణాలు, విద్య, వైద్యం, రవాణా వంటి అవసరాలపై ఖర్చు చేయగలుగుతాయి. ఈ విధంగా వ్యవసాయం అనేక రంగాలకు ఆర్థిక చోదకశక్తిగా పనిచేస్తుంది.



వర్షాభావ పరిస్థితుల్లో సాగు విస్తీర్ణం తగ్గడం, బోరుబావులు ఎండిపోవడం, భూగర్భజలాలు పడిపోవడం, విద్యుత్ సరఫరాపై ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు రైతులను వెంటాడుతాయి. పెట్టుబడులు పెట్టినప్పటికీ దిగుబడులు రాకపోతే రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంటుంది. వ్యవసాయ కూలీలకు ఉపాధి తగ్గుతుంది. పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం వంటి అనుబంధ రంగాలపైనా ప్రభావం పడుతుంది. గ్రామీణ కుటుంబాలు పట్టణాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడవచ్చు.

ఇలాంటి సమయంలో రైతులకు తగిన మద్దతు అందించడం, నీటి వనరులను సంరక్షించడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, కరువును తట్టుకునే పంటల సాగును విస్తరించడం, ఉపాధి హామీ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. అదే సమయంలో వ్యవసాయ కుటుంబాలు కూడా సాధ్యమైనంత వరకు అవసరాలు, పెట్టుబడులు, అప్పులు, పొదుపుల మధ్య సమతుల్యత పాటించాలి. అయితే రైతులపై మాత్రమే పొదుపు బాధ్యతను మోపడం సరికాదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆదాయం కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వ రక్షణ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలి.

**ఆహార భద్రత.. ధరల పెరుగుదలపై అప్రమత్తత అవసరం**

ఆహారం ప్రతి మనిషి ప్రాథమిక హక్కు. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు, పాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే మొదట నష్టపోయేది తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలే. వారి ఆదాయంలో అధిక భాగం ఆహారం, ఇల్లు, విద్యుత్, రవాణా, వైద్యం వంటి కనీస అవసరాలకే ఖర్చవుతుంది. ధరలు పెరిగినప్పుడు ఇతర అవసరాలను తగ్గించుకోవాల్సి వస్తుంది. పిల్లల విద్య, కుటుంబ ఆరోగ్యం, పోషకాహారం కూడా ప్రభావితమవుతాయి. కరువు కారణంగా ఉత్పత్తి తగ్గితే కొన్ని ఆహార పదార్థాల ధరలు పెరగవచ్చు. అయితే ధరల పెరుగుదల వర్షాభావం ఒక్కదానిపైనే ఆధారపడదు. నిల్వలు, దిగుమతులు, రవాణా వ్యయాలు, ఇంధన ధరలు, సరఫరా వ్యవస్థ, మార్కెట్ పోటీ, ప్రభుత్వ విధానాలు వంటి అనేక అంశాలు ధరలను ప్రభావితం చేస్తాయి.

అందువల్ల బియ్యం కిలో ధర రూ.500 దాటుతుందని లేదా క్వింటాలు ధర రూ.10,000 అవుతుందని ఆధారాలు లేకుండా నిర్ధారించడం సముచితం కాదు. అలాంటి పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే అసలు లక్ష్యం కావాలి.

ప్రభుత్వం ఆహార ధాన్యాల నిల్వలను నిరంతరం సమీక్షించాలి. ఉత్పత్తి, వినియోగం, నిల్వలు, మార్కెట్ ధరలపై ముందస్తు అంచనాలు రూపొందించాలి. అవసరమైన చోట నిల్వల విడుదల, ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం, రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు అందుబాటు ధర మధ్య సమతుల్యత సాధించాలి. కృత్రిమ కొరత సృష్టించే అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయించే చర్యలపై చట్టబద్ధమైన పర్యవేక్షణ ఉండాలి.

ప్రజలు కూడా ఆహారాన్ని వృథా చేయకుండా చూడాలి. కుటుంబ అవసరాలకు సరిపడేంత మాత్రమే కొనుగోలు చేయాలి. భయంతో అధికంగా నిల్వ చేయడం వల్ల మార్కెట్లో తాత్కాలిక కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. పొదుపు అంటే అవసరమైన ఆహారాన్ని తగ్గించుకోవడం కాదు; వృథాను నివారించడం, అనవసర కొనుగోళ్లను నియంత్రించడం, కుటుంబ ఆదాయాన్ని ప్రణాళికాబద్ధంగా వినియోగించడం.

**ద్రవ్యోల్బణం.. సామాన్యుడి కొనుగోలు శక్తిపై భారం**

వస్తువులు, సేవల సాధారణ ధరల స్థాయి నిరంతరం పెరుగుతూ ఉంటే దానిని ద్రవ్యోల్బణం అంటారు. ధరలు పెరిగినప్పుడు అదే ఆదాయంతో గతంలో కొనుగోలు చేసినంత సరుకును ఇప్పుడు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీనినే కొనుగోలు శక్తి తగ్గడం అంటారు. ముఖ్యంగా స్థిర ఆదాయం కలిగిన ఉద్యోగులు, పెన్షనర్లు, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులు ధరల పెరుగుదలతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటారు.

కరువు కారణంగా ఆహార ఉత్పత్తి తగ్గడం వల్ల కొన్ని ఆహార ధరలు పెరిగే అవకాశం ఉంది. అయితే ప్రతి ధరల పెరుగుదల ద్రవ్యోల్బణ సంక్షోభానికి దారితీస్తుందని చెప్పలేం. ద్రవ్యోల్బణం తీవ్రతను నిర్ణయించేది మొత్తం సరఫరా, డిమాండ్, ఉత్పత్తి వ్యయాలు, రవాణా ఖర్చులు, ఇంధన ధరలు, ద్రవ్య విధానం వంటి అనేక అంశాల సమ్మేళనం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# కలేకూరి ప్రసాద్..

**నిన్నటి సంచిక తరువాయి**

విద్య, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. కానీ ఈ మార్పుల మధ్య కూడా కులవివక్ష పూర్తిగా అంతరించిపోలేదు. విద్యాసంస్థల్లో వివక్షకు సంబంధించిన ఆరోపణలు వినిపిస్తున్నాయి. కులాంతర వివాహాలు సామాజిక వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయి. భూమి, ఉపాధి, వనరులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో అసమానతలు కొనసాగుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో కూడా కులపరమైన అవమానాలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కలేకూరి ప్రసాద్ రచనలు మనల్ని గతానికి మాత్రమే తీసుకెళ్లవు. వర్తమానాన్ని కూడా ప్రశ్నిస్తాయి.

రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇచ్చినప్పుడు ఆ సమానత్వం ప్రజల దైనందిన జీవితాల్లో ఎంతవరకు అమలవుతోంది? ఒక వ్యక్తి ప్రతిభను కులం ఆధారంగా అంచనా వేసే పరిస్థితి ఎందుకు కొనసాగుతోంది? శ్రమ చేసే మనిషికి గౌరవం ఎందుకు దక్కడం లేదు? సామాజికంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు, సంస్థలు, సమాజం ఎంతవరకు బాధ్యత వహిస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకకుండా కేవలం అభివృద్ధి గురించి మాట్లాడటం అసంపూర్ణం. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడటం దళితుల బాధ్యత మాత్రమే కాదు. అది సమానత్వాన్ని కోరుకునే ప్రతి ఒక్కరి బాధ్యత. దళిత సాహిత్యాన్ని చదవడం అంటే ఒక ప్రత్యేక వర్గం అనుభవాలను తెలుసుకోవడం మాత్రమే కాదు. మన సమాజంలోని దాగివున్న అధికార సంబంధాలను అర్థం చేసుకోవడం కూడా. కలేకూరి ప్రసాద్‌ను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఇక్కడే ఉంది. ఆయన కవిత్వం మనకు సిద్ధంగా ఉన్న సమాధానాలను అందించకపోవచ్చు. కానీ మనం తప్పించుకోలేని ప్రశ్నలను ముందుంచుతుంది. మనం అలవాటుగా అంగీకరించిన సామాజిక వాస్తవాలను తిరిగి పరిశీలించమని కోరుతుంది. సమానత్వం గురించి మనం చేసే ప్రకటనలకు, మన ఆచరణకు మధ్య ఉన్న దూరాన్ని గుర్తు చేస్తుంది.

**తెలంగాణ సమాజానికి కలేకూరి స్ఫూర్తి**

తెలంగాణ సామాజిక చరిత్రలో కులవివక్షకు వ్యతిరేకంగా, భూస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన పోరాటాలు ఈ నేల ప్రజల్లో సామాజిక న్యాయం పట్ల బలమైన ఆకాంక్షను పెంచాయి. దళిత, బహుజన ఉద్యమాలు కూడా ఆ ఆకాంక్షను కొత్త రూపాల్లో వ్యక్తం చేశాయి. తెలంగాణలో దళిత ఆత్మగౌరవం గురించి మాట్లాడేటప్పుడు భూమి, కులం, శ్రమ, విద్య, రాజకీయ ప్రాతినిధ్యం, సాంస్కృతిక హక్కులను విడివిడిగా చూడలేం.

గ్రామంలో భూమి లేని వ్యవసాయ కూలీ పరిస్థితి, కులవివక్షను ఎదుర్కొనే విద్యార్థి అనుభవం, సామాజిక గౌరవం కోసం పోరాడే యువకుడి ఆకాంక్ష, మహిళలపై కులం–పితృస్వామ్యం కలిసి చూపే ప్రభావాలు ఇవన్నీ విస్తృతమైన సామాజిక న్యాయ ప్రశ్నలో భాగాలు. కలేకూరి ప్రసాద్ రచనలను తెలంగాణ సామాజిక వాస్తవికతతో అనుసంధానించి చదవడం వల్ల ఈ అంశాలపై కొత్త అవగాహన ఏర్పడుతుంది. ప్రత్యేకించి యువత ఆయన కవిత్వాన్ని చదివినప్పుడు సామాజిక సమస్యలను కేవలం వ్యక్తిగత అనుభవాలుగా కాకుండా, చారిత్రక నేపథ్యం ఉన్న సమస్యలుగా చూడగలగాలి. కులవివక్షను ప్రశ్నించడం అంటే ఒక కులానికి వ్యతిరేకంగా నిలబడటం కాదు. మనుషులను ఉన్నత, నీచ స్థాయిలుగా విభజించే వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడటం. సమానత్వం కోసం పోరాడటం అంటే ఎవరి గౌరవాన్నీ నిరాకరించకుండా అందరికీ సమాన హక్కులు కల్పించే సమాజాన్ని కోరుకోవడం. ఈ స్ఫూర్తిని కలేకూరి ప్రసాద్ సాహిత్యం నుంచి స్వీకరించాలి.



**కలేకూరి వారసత్వాన్ని ఎలా కాపాడాలి?**

ఒక రచయిత మరణించిన తర్వాత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేయడం, జయంతి సభలు నిర్వహించడం, సంస్మరణ వ్యాసాలు రాయడం అవసరమే. కానీ అవి మాత్రమే సరిపోవు. కలేకూరి ప్రసాద్ వంటి కవుల వారసత్వాన్ని సజీవంగా ఉంచాలంటే కొన్ని ముఖ్యమైన పనులు చేపట్టాలి. మొదటిది సంపూర్ణ రచనల సేకరణ. ఆయన కవితలు, పాటలు, వ్యాసాలు, సాహిత్య విమర్శలు, అనువాదాలు, ప్రసంగాలు, ఇంటర్వ్యూలను సేకరించి ప్రామాణిక సంపుటాలుగా ప్రచురించాలి. పత్రికల్లో ప్రచురితమైన రచనలు, అందుబాటులో లేని రచనలను గుర్తించేందుకు పరిశోధన జరగాలి. రెండవది విమర్శనాత్మక అధ్యయనం. ఆయన సాహిత్యాన్ని కేవలం ప్రశంసలతో పరిమితం చేయకుండా, దళిత సాహిత్యం, వామపక్ష సాహిత్యం, అంబేద్కర్ ఆలోచన, మార్క్సిస్టు విశ్లేషణ, ప్రజా సంస్కృతితో పోల్చి అధ్యయనం చేయాలి.

మూడవది యువతకు పరిచయం. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, గ్రంథాలయాలు, సాహిత్య వేదికల్లో ఆయన రచనలపై చర్చలు నిర్వహించాలి. ఆయన కవితలను చదివించడం మాత్రమే కాకుండా, వాటి సామాజిక నేపథ్యాన్ని కూడా వివరించాలి. నాలుగవది ప్రజా సంస్కృతిలోకి పునఃప్రవేశం. ఆయన పాటలను, కవితలను నాటకాలు, సంగీత ప్రదర్శనలు, సాహిత్య సభలు, ప్రజా కళారూపాల ద్వారా కొత్త తరాలకు అందించాలి. ఐదవది సామాజిక న్యాయ ఉద్యమాలతో అనుసంధానం. ఆయన రచనల్లోని ఆత్మగౌరవం, సమానత్వం, కులవివక్ష వ్యతిరేకత వంటి విలువలను నేటి సామాజిక సమస్యలతో అనుసంధానించి చర్చించాలి. ఒక కవి వారసత్వం పుస్తకాల అల్మారాల్లో భద్రంగా ఉండటంలో మాత్రమే లేదు. ఆ కవి లేవనెత్తిన ప్రశ్నలు ప్రజల జీవితాల్లో సజీవంగా ఉండటంలో ఉంది. కలేకూరి ప్రసాద్ విషయంలో ఈ బాధ్యత మరింత ముఖ్యమైనది.

**పిడికెడు ఆత్మగౌరవం.. సమసమాజం వైపు ఒక అడుగు**

కలేకూరి ప్రసాద్ కవిత్వంలో ఆత్మగౌరవం ఒక ప్రధాన భావనగా నిలుస్తుంది. అయితే ఆత్మగౌరవం వ్యక్తిగత స్థాయిలో మాత్రమే మిగిలిపోతే దాని సామాజిక ప్రాధాన్యం పరిమితమవుతుంది. ఒక వ్యక్తి తన గౌరవం కోసం పోరాడటం అవసరం. ఒక సమూహం తన హక్కుల కోసం సంఘటితం కావడం కూడా అవసరం. కానీ ఏ మనిషికీ తన కులం, మతం, లింగం, ఆర్థిక స్థితి కారణంగా అవమానం జరగని సమాజాన్ని నిర్మించడం మరింత విస్తృతమైన లక్ష్యం. సామాజిక న్యాయం అంటే చట్టం ముందు సమానత్వం మాత్రమే కాదు. విద్య, వైద్యం, ఉపాధి, జీవనోపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సాంస్కృతిక గౌరవం వంటి రంగాల్లోనూ సమాన అవకాశాలు ఉండాలి.

సమానత్వం అంటే అందరినీ ఒకేలా చూడటం మాత్రమే కాదు. చారిత్రకంగా వెనుకబడిన ప్రజలు ఎదుర్కొన్న అడ్డంకులను గుర్తించి వాటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం కూడా. కుల నిర్మూలన అంటే కులపేర్లను ఉచ్చరించకపోవడం మాత్రమే కాదు. కులం ఆధారంగా మనుషుల హోదాలను నిర్ణయించే ఆలోచనలను, ఆచరణలను, అధికార సంబంధాలను మార్చడం. ఇలాంటి విస్తృతమైన సామాజిక పరివర్తనలోనే కలేకూరి ప్రసాద్ ఆత్మగౌరవ భావనకు నిజమైన అర్థం లభిస్తుంది. పిడికెడు ఆత్మగౌరవం కోసం మొదలైన ప్రయాణం సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం వైపు సాగాలి.

అణచివేతకు గురైన ప్రతి మనిషి తలెత్తుకుని నిలబడగలగాలి. ప్రతి బిడ్డకు తన సామాజిక నేపథ్యం కారణంగా అవమానం ఎదురుకాకూడదు. ప్రతి మహిళ తన స్వేచ్ఛను, గౌరవాన్ని కాపాడుకోగలగాలి. ప్రతి కార్మికుడి శ్రమకు తగిన గుర్తింపు దక్కాలి. ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు లభించాలి. అదే నిజమైన ప్రజాస్వామిక సమాజం. అదే సామాజిక న్యాయం. అదే కలేకూరి ప్రసాద్ సాహిత్యాన్ని మన జీవితాల్లోకి తీసుకురావడం.

**అక్షరాల్లో బతికే ఆత్మగౌరవం**

కలేకూరి ప్రసాద్ 2013 మే 17న ఒంగోలులో మరణించారు. ఒక మనిషి జీవితం ముగియవచ్చు. ఒక కవి తన చివరి కవితను రాసి ఆగిపోవచ్చు. ఒక ఉద్యమకారుడి అడుగులు నిలిచిపోవచ్చు. కానీ ఆయన రచనలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాజం సమాధానాలు వెతుకుతున్నంతకాలం ఆయన ఆలోచనలు సజీవంగానే ఉంటాయి. కలేకూరి ప్రసాద్‌ను స్మరించుకోవడం అంటే ఆయనను గతానికి చెందిన వ్యక్తిగా మాత్రమే చూడటం కాదు. వర్తమానంలోని అసమానతలను ప్రశ్నించడానికి ఆయన సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకోవడం. ఆయన జయంతి సందర్భంగా పూలమాలలు సమర్పించడంతోపాటు, ఆయన కవిత్వాన్ని చదవాలి. ఆయన ఆలోచనలను చర్చించాలి. ఆయన రచనల్లోని సామాజిక విమర్శను అర్థం చేసుకోవాలి. ఆయన ఆకాంక్షించిన సమానత్వం ఇంకా ఎందుకు పూర్తిగా సాధ్యం కాలేదో ప్రశ్నించాలి.

కులం పేరుతో మనిషిని అవమానించే ప్రతి సందర్భంలోనూ ఆత్మగౌరవం అవసరం. శ్రమ చేసే మనిషిని తక్కువగా చూసే ప్రతి సందర్భంలోనూ సమానత్వం అవసరం. మహిళల స్వేచ్ఛను నిరాకరించే ప్రతి సందర్భంలోనూ మానవత్వం అవసరం. ప్రజాస్వామ్యాన్ని కేవలం అధికార మార్పిడికి పరిమితం చేసే ప్రతి సందర్భంలోనూ సామాజిక న్యాయం అవసరం. ఈ అవసరాలను గుర్తుచేసే సాహిత్యం ఎప్పటికీ పాతబడదు. కలేకూరి ప్రసాద్ కవిత్వం మనకు అందించే ముఖ్యమైన స్ఫూర్తి ఇదే.

ఆయనను ఒక విగ్రహంగా మార్చి దూరంగా నిలబెట్టడం కాదు మన కర్తవ్యం. ఆయన రచనలను ప్రజల మధ్యకు తీసుకెళ్లడం. ఆయన ఆలోచనలను విమర్శనాత్మకంగా చర్చించడం. ఆయన పోరాడిన సామాజిక అన్యాయాలు తిరిగి తలెత్తకుండా ప్రజాస్వామిక చైతన్యాన్ని విస్తరించడం. కలేకూరి ప్రసాద్‌ను స్మరించుకోవడమంటే ఆత్మగౌరవాన్ని స్మరించుకోవడం. ఆయన కవిత్వాన్ని చదవడమంటే సమానత్వం కోసం మనల్ని మనం ప్రశ్నించుకోవడం. ఆయన వారసత్వాన్ని కాపాడటమంటే కులవివక్ష లేని సమాజ నిర్మాణం కోసం మన వంతు బాధ్యతను స్వీకరించడం. అక్షరాలు ఆయుధాలవుతాయి. పాటలు ఉద్యమాలవుతాయి. కవిత్వం చరిత్రను ప్రశ్నిస్తుంది. ఒక మనిషి స్వరం వేలాది గొంతుకల్లో ప్రతిధ్వనిస్తుంది. అందుకే కలేకూరి ప్రసాద్ ఒక జ్ఞాపకం మాత్రమే కాదు. సమాజాన్ని ప్రశ్నించే ఒక చైతన్యం. ఒక కవి మరణించినా ఆయన లేవనెత్తిన ప్రశ్నలు మరణించవు. ఒక ఉద్యమకారుడి ప్రయాణం ఆగిపోయినా ఆయన కలలు కనిన సమాజం కోసం పోరాటం ఆగకూడదు. కలేకూరి ప్రసాద్ జయంతి మనకు అందించే పిలుపు కూడా అదే. మనిషిని మనిషిగా గౌరవిద్దాం. కులాధిపత్యాన్ని ప్రశ్నిద్దాం. ఆత్మగౌరవాన్ని కాపాడుదాం. సమానత్వాన్ని ఆచరణలోకి తెద్దాం. అణచివేత లేని సమాజం కోసం అక్షరాన్నీ, ఆలోచననూ, ఆచరణనూ అనుసంధానిద్దాం. అదే కలేకూరి ప్రసాద్‌కు మనం అందించగల నిజమైన నివాళి!



మామిండ్ల రమేష్ రాజా
7893230218

# కొంగరకలాన్‌లో డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు కొత్త అశోక్ గౌడ్ హెచ్చరిక
- లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తాం
- ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి

**రంగారెడ్డి , అక్టోబర్ 26 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం వెనుక ఉన్న చెత్త డంపింగ్ యార్డును కొంగరకలాన్ గ్రామం నుంచి తక్షణమే తొలగించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కొత్త అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు వల్ల స్థానిక ప్రజలు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డిని బీజేపీ డివిజన్ అధ్యక్షులు గజ్జల నర్సింహా రెడ్డితో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్త అశోక్ గౌడ్ మాట్లాడుతూ... కొంగరకలాన్‌లోని సర్వే నెంబర్ 300లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే తీవ్ర దుర్వాసనతో కొంగరకలాన్ గ్రామ ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఇతర తీవ్ర అనారోగ్య సమస్యలతో అల్లాడిపోతున్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఫాక్స్‌కాన్, కేన్స్ పరిశ్రమలతో పాటు, జిల్లా ప్రధాన పాలనా కేంద్రమైన కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోనే ఈ చెత్తను నిల్వ చేయడం వల్ల పారిశ్రామిక, పాలనా వాతావరణం దెబ్బతింటోందన్నారు. డంపింగ్ యార్డుకు ఆనుకొని ఉన్న బోడబండ'మంచినీటి క్వారీ నీటిని గతంలో గ్రామస్తులు నిత్యావసరాలకు, తాగునీటికి వినియోగించేవారు. చెత్త వ్యర్థాలు చేరడంతో ఆ నీరంతా కలుషితమై వాడుకకు పనికిరాకుండా పోయిందన్నారు. పక్కనే పవిత్రమైన పెద్దమ్మ తల్లి, బీరప్ప దేవాలయాలు ఉన్నప్పటికీ... ఆదిభట్ల సర్కిల్‌కు చెందిన సుమారు లక్ష మంది జనాభా చెత్తను తెచ్చి ఇక్కడ వేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. తాగునీటి మూలాలు, ఆలయాల పవిత్రత, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి నిర్వహించే ఈ డంపింగ్ యార్డును వెంటనే అక్కడి నుంచి తరలించాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పొట్టిరాములు, పండల లక్ష్మిపతి గౌడ్, ఉడుతల అశోక్ గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శివ వీరస్వామి గౌడ్, ఆదిభట్ల డివిజన్ అధ్యక్షులు కూర శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రామగల నరసింహ, మాజీ ఉపసర్పంచ్ సభావత్ రమేష్, కోలా శ్రీనివాస్, సభావత్ కృష్ణ, బూత్ కమిటీ ప్రెసిడెంట్ నోముల రాజు, బీజేవైఎం నాయకులు గోదసు శ్రీకాంత్, ఉడుగుల భరత్ గౌడ్, గోదాస్ ప్రశాంత్ పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు ఎంతో కీలకం

- ఏఐసీసీ పరిశీలకులు మోహన్ కుమార మంగళం

**రంగారెడ్డి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం అని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే అత్యంత కీలక ఆయుధమని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ తెలంగాణ రాష్ట్ర పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా పరిది చేవెళ్లే నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగురింత పారిజాత నరసింహారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కాంగ్రెస్ కమిటీ సమావేశానికి రంగారెడ్డి డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభను ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపైనా ఉందని, ఓటు హక్కు పరిరక్షణే దేశ పరిరక్షణ అని అన్నారు. దేశంలో మారుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ప్రజలను చైతన్యవంతం చేయడానికే 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ... రాబోయే నవంబర్ 1వ తేదీన రామ్‌లీలా మైదానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు చేవెళ్ల నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రఘునాథ్ యాదవ్, టీపీసీసీ కో ఆర్డినేటర్ అఫ్సర్ జెసోసి, నియోజకవర్గం ఇంచార్జులు భీమ్ భరత్, జగదీశ్వర్ గౌడ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, నాయకులు గౌరీ సతీష్, ఏనుగు జంగారెడ్డి, షాబాద్ దర్శన్, రాంరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా సలావుద్దీన్ అమీర్, రఘునందన్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి, జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే వైఖరిపై అసంతృప్తి

- కాంగ్రెస్ బాటలో బీఆర్‌ఎస్ శ్రేణులు
- మల్కాజిగిరిలో కొనసాగుతున్న వలసలు

**మల్కాజిగిరి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఒంటెద్దు పోకడలతో విసిగిపోయిన పలువురు సీనియర్ నేతలు పది రోజుల క్రితమే నేరెడ్ మెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముఖ్య కార్యకర్తలు పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంటెస్ట్ కార్పొరేటర్ సర్వే నరేష్, సీనియర్ నాయకులు తుపాకుల జనార్ధన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి నాయకులు ఒకరి తర్వాత ఒకరు కాంగ్రెస్ గూటికి చేరుతుండటంతో నియోజకవర్గ రాజకీయాల్లో వేడి రాజుకుంది. ఎమ్మెల్యే ఎన్నికైనప్పటి నుంచి కార్యకర్తలను, స్థానిక సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని వలస వెళ్లిన నాయకులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ పూర్తిగా అటకెక్కిందని, సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా నిర్మాణ దశలో ఉండి ఆగిపోయిన క్యాంపు కార్యాలయాన్ని అధికారులతో చర్చించి పునర్నిర్మించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే కార్యాలయం దూరంగా ఉండటంతో సామాన్య ప్రజలు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలవలేని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరి, ఆయన ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో విసుగు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భవిష్యత్ కార్యాచరణలో భాగంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. స్థానిక క్యాడర్‌ను పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో పార్టీ మరింత బలహీనపడే ప్రమాదముందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏకే ముర్గేష్, భరత్, వరుణ్, లక్ష్మీకాంత్ రెడ్డి, రహ్ మరన్, రాఘవన్, కృష్ణ, మల్లేష్, ఆల్బర్ట్, రమేష్, అశోక్, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాలు, పోక్సో చట్టంపై యువతకు అవగాహన



**అల్వాల్, అక్టోబరు 26 (జనంసాక్షి) :** సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటంతోపాటు, పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అల్వాల్ పోలీసులు యువతకు సూచించారు. సోమవారం అల్వాల్‌లోని టెంపుల్ వద్ద ఎస్‌హెచ్‌ఓ ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టం, డ్రగ్స్ దుష్ప్రభావాలపై వివరించారు. మైనర్లపై లైంగిక నేరాల నిరోధానికి ఉద్దేశించిన పోక్సో చట్టం గురించి యువతకు అవగాహన కల్పించారు. బాలికల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, వారి భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడకుండా అపరిచితుల నుంచి వచ్చే సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారి భద్రతకు సహకరించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుళ్లు రాములు, ముక్తార్, జావేద్ పాల్గొన్నారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపునకు పోరుబాట

- అక్టోబర్ 27న ఈటల రాజేందర్ పాదయాత్ర ప్రారంభం..
- 30న జవహర్ నగర్‌లో భారీ బహిరంగ సభ



**జవహర్ నగర్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రకు బీజేపీ నాయకులు సన్నాహాలు ముమ్మరం చేశారు. ఈ పాదయాత్రను విజయవంతం చేయడమే లక్ష్యంగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ పాదయాత్ర చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు ఎదులాబాద్‌లో పాదయాత్ర ప్రారంభం కానుండగా, 30వ తేదీన జవహర్ నగర్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభతో ముగియనుంది. పాదయాత్రలో భాగంగా డంపింగ్ యార్డ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధానంగా ప్రస్తావించనున్నారు. డంపింగ్ యార్డ్ కారణంగా పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర దుర్వాసన, పర్యావరణ కాలుష్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు డంపింగ్ యార్డ్ తరలింపునకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ సమస్య ఏ ఒక్క ప్రాంతానికో, రాజకీయ పార్టీకో సంబంధించినది కాదని, ఇది ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశమని నాయకులు పేర్కొన్నారు. అందువల్ల రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జ్ రవీందర్ గౌడ్, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు మహేందర్ యాదవ్, రాము నాయక్, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, కె. యాదగిరి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

- మక్తల్‌లో యజ్ఞంలా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు
- గృహప్రవేశ వేడుకకు హాజరైన వాకిటి లలిత

**మక్తల్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోందని మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత అన్నారు. మక్తల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు ఒక యజ్ఞంలా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తాజాగా మక్తల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు ఆమె హాజరై, నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపి వారికి వాకిటి వారి కానుకను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్ష అని తెలిపారు. నియోజకవర్గంలో ఏ ఒక్క పేదవాడు కూడా పూరి గుడిసెల్లో నివసించకూడదని, ప్రతి నిరుపేద కుటుంబం ఆత్మగౌరవంతో సొంతింటిలో జీవించాలన్నదే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. పేద కుటుంబానికి సొంతిల్లు కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, అది భద్రతకు, ఆత్మగౌరవానికి, భవిష్యత్తుపై భరోసాకు ప్రతీక అని వాకిటి లలిత అన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు తమ కల నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేయడం తనకు సంతోషంగా ఉందన్నారు. మక్తల్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా సాధ్యమైనంత మేలు చేకూర్చేందుకు మంత్రి వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారని వాకిటి లలిత తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం తమ ప్రాధాన్యమని వాకిటి లలిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, వార్డు కౌన్సిలర్లు రహీం పటేల్, మహేష్, నీలా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు

**మెదక్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. సోమవారం నార్సింగి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన మెదక్ నియోజకవర్గం లోని గ్రామాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు, ఆరుగురికి కల్యాణలక్ష్మి చెక్కులు, రెండు వేల మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే రోహిత్ రావు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు తహసీల్దార్ గ్రేస్ బాయి, ఆర్ఐ శ్రీధర్ పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు శాలువాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఈ యాదగిరి, ఏ ఈ సంధ్య, ఎంపీడీవో తిరుపతిరెడ్డి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




# జవహర్‌నగర్ అభివృద్ధికి రూ.35 కోట్లు..

- పనులు వెంటనే ప్రారంభించాలి
- మంజూరైన నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం
- ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ వినతి

**జవహర్‌నగర్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ సమగ్ర అభివృద్ధికి మంజూరైన రూ.35 కోట్ల నిధులతో చేపట్టనున్న పనులను త్వరితగతిన ప్రారంభించాలని జవహర్‌నగర్ మాజీ మేయర్, 3వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి అభివృద్ధి పనుల ప్రారంభంపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో జవహర్‌నగర్ అభివృద్ధికి రూ.35 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ నిధుల మంజూరులో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కీలక పాత్ర పోషించారని ఆమె పేర్కొన్నారు. మంజూరైన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను త్వరితగతిన జారీ చేసి, సంబంధిత కాంట్రాక్టర్లకు వర్క్ ఆర్డర్లు అందజేయాలని శాంతి కోటేష్ గౌడ్ కమిషనర్‌ను కోరారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులతో డివిజన్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకుల విజ్ఞప్తిపై ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జవహర్‌నగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు, ప్రత్యేక కృషి చేసిన తోటకూర వజ్రేష్ యాదవ్‌కు, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సహకరిస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమం, జవహర్‌నగర్ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్, ప్రధాన కార్యదర్శులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, గజ్వేల్ శంకర్, ప్రేమల శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఓటు చోరీని అరికట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

- ఓటరు జాబితాలో అవకతవకలు లేకుండా చూడాలి..
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**అమీర్‌పేట/సనత్‌నగర్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, దానిని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ అన్నారు. సోమవారం బాలంరాయిలోని క్లాసిక్ గార్డెన్స్‌లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అధ్యక్షతన నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' అభియాన్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అవినాష్ పాండే, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సచిన్ సావంత్, హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆదం సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ.. ఓటు కేవలం నాయకుడిని ఎన్నుకునే సాధనం మాత్రమే కాదని, దేశ భవిష్యత్తును, ప్రభుత్వాల పాలనా దిశను నిర్ణయించే కీలకమైన ప్రజాస్వామ్య ఆయుధమని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడంతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా, అనర్హుల పేర్లు చేరకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జాబితాలో పేర్లను పరిశీలించుకోవడం, అవసరమైన సవరణలు చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఓటు చోరీకి సంబంధించిన ఆరోపణలు, ఓటరు జాబితాలో అవకతవకలపై వచ్చే ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించి, తప్పులు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, తొలిసారి ఓటు వేయనున్నవారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని సూచించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే 'ఓట్ బచావో.. దేశ్ బచావో' అభియాన్ లక్ష్యమని డాక్టర్ కోట నీలిమ పేర్కొన్నారు.



# మహబూబ్‌నగర్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- **రూ.220 కోట్లతో 14 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం**
- **నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సమగ్ర ప్రణాళిక**



**మహబూబ్‌నగర్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించి, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నగరంలో సుమారు రూ.220 కోట్లతో 14 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు సమగ్ర తాగునీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో, జైనల్లిపూర్‌లో నూతనంగా నిర్మించనున్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ నగరంలో తాగునీటి కొరత, నీటి సరఫరాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అందరికీ తెలిసిందేనన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, కొత్త కాలనీల ఏర్పాటు, నగర విస్తరణకు అనుగుణంగా మరింత పటిష్టమైన తాగునీటి సరఫరా వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని అన్ని ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. నగరంలో చేపడుతున్న 14 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనుల్లో భాగంగా తాజాగా రెండు ట్యాంకులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో 1,000 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుకు రూ.172.58 లక్షలు, జైనల్లిపూర్‌లో 400 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న ట్యాంకుకు రూ.83.72 లక్షలు అంచనా వ్యయంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నిర్మాణాలు పూర్తయితే ఆయా ప్రాంతాలతో పాటు పరిసర కాలనీల్లో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు. మహబూబ్‌నగర్ నగరం భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరులు, పైప్‌లైన్లు, నీటి నిల్వ ట్యాంకులు, పంపింగ్ వ్యవస్థల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, రాబోయే సంవత్సరాల్లో పెరగనున్న నీటి అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో పైప్‌లైన్ల విస్తరణ, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, పంపింగ్ వ్యవస్థల ఆధునికీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నగరంలోని అన్ని కాలనీలకు సమానంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని అధికారులకు సూచించారు. కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నీటి సరఫరాలో సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. నగర ప్రజల ప్రస్తుత అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తులోనూ నీటి కొరత తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ.220 కోట్లతో చేపడుతున్న తాగునీటి అభివృద్ధి పనులు మహబూబ్‌నగర్ నగరానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చేలా ఉంటాయని, అన్ని కాలనీల ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సిజే బెనహర్, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, రమేష్ బాబు, సిజే పూజిత, దేవ్లీ మేఘ్యానాయక్, శ్రీనివాస్ రాజు, తాహెర్, నాయకులు గుమ్మాల శ్రీనివాస్, మైత్రి యాదయ్య, చంద్రమౌళి, తుప్పలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి పాత బస్టాండ్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

- **పాత బస్టాండ్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వ్యాపార సముదాయాల ఏర్పాటు**



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** పట్టణంలోని పాత బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, సుందరీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. పాత బస్టాండ్‌ను ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న మురుగునీటి కాలువను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా మార్చడంతో పాటు, అక్కడ వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెల్లడించారు. బస్టాండ్‌కు సంబంధించిన స్థల రికార్డులను తీసుకురావాలని ఆర్టీసీ డీఎంకు సూచించారు.బస్టాండ్ ప్రాంగణాన్ని శుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్ది ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. పాత బస్టాండ్ పునరుద్ధరణతో పట్టణంలో ప్రజలకు మరింత ఉపయోగకరమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి, పరుశురాం, కౌన్సిలర్లు వెంకటేష్, చుక్కరాజు, బి. కృష్ణ, పాల రవి, యాదగిరి, మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, వనపర్తి ఆర్టీసీ డీఎం దేవేందర్ గౌడ్, కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి



**జడ్చర్ల, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ తెలంగాణ ఆధ్వర్యంలో రైతులు పార్టీలకు అతీతంగా జడ్చర్ల ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అర్హులైన రైతులందరికీ వడ్డీతో సహా రుణమాఫీ పూర్తి చేయాలని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఎకరానికి రూ. 15,000 చొప్పున రైతు భరోసా బకాయిలు, రైతు కూలీలకు ఏడాదికి రూ. 12,000 చెల్లించాలని కోరారు. వరంగల్ డిక్లరేషన్ ప్రకారం అన్ని పంటలకు కనీస మద్దతు ధరకి రూ. 500 కలిపి కొనుగోలు చేయాలని, 22ఎ నిబంధనల నుంచి పట్టా భూములను తొలగించి రైతులకు హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి, బోధన్, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీలను పునఃప్రారంభించి చెరకు ధర పెంచాలని, మార్కెట్లలో కమీషన్ల దోపిడీని అరికట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి వెంకోబ, అధికార ప్రతినిధి ఎంబీ బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు జగ్ పాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాం రెడ్డి, కార్యదర్శి నరేందర్ రెడ్డి, శివ దర్శన్, సాయి కిరణ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 26 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతి,ఫారం- 6,7,8 దరఖాస్తుల పెండింగ్,ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడీఓసి వీడియో కాన్ఫరెన్స్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.ఫారం-6, 7,8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ఎస్ఐఆర్‌లో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి,అర్హతలను నిర్ధారించాలన్నారు.అనర్హులుగా గుర్తించిన ఓటర్ల విషయంలో అనర్హతకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేసి,సంబంధిత ఆధారాలతో సహా పూర్తి వివరాలను రికార్డుల్లో భద్రపరచాలన్నారు.

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి**



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదని తెలిపారు.ఈ ప్రక్రియలో అందిన దరఖాస్తులను సంబంధిత అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.నకిలీ,తప్పుడు, డూప్లికేట్ దరఖాస్తులను గుర్తించి, దరఖాస్తుదారుల అర్హతలను నిబంధనల ప్రకారం నిర్ధారించాలని ఆదేశించారు. ప్రైవేట్ వ్యక్తులు లేదా అనధికార వ్యక్తుల ద్వారా విద్యార్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం కల్పించి,అర్హులైన పట్టభద్రులు గడువులోగా ఫారం-18 దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఓటరు నమోదు ప్రక్రియలో ఆమోదించిన,తిరస్కరించిన దరఖాస్తుల వివరాలను సంబంధిత కార్యాలయాల్లో స్పష్టంగా ప్రదర్శించి,పారదర్శకత పాటించాలన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పెండింగ్ పనులు,విచారణలు, హియరింగ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్లకు సంబంధించి స్పీకింగ్ ఆర్డర్ కాపీలు, ఆధారాలను సేకరించి నెలలోగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.బీఎల్ఓలతో సమన్వయం చేసుకుని ఫారం-6, 7, 8 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సంఖ్యను పెంచేందుకు విస్తృత ప్రచారం కల్పించాలని, అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిశీలించి, పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యాలయానికి సంబంధించిన అధికారిక పత్రాలను అనధికార వ్యక్తులకు అందజేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస రావు,ఏ.ఓ మంజుల,అన్ని మండలాల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# మార్చలలో కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పర్యటన

- **ఇందిరమ్మ ఇంటి తుది బిల్లు మంజూరుకు ఆదేశం**
- **అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవల పరిశీలన**
- **బాలాజీ కాటన్ మిల్లులో పత్తి సేకరణ, ప్రాసెసింగ్‌పై ఆరా**

**కల్వకుర్తి, అక్టోబరు 26 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం కల్వకుర్తి మండలం మార్చల గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం, అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, బాలాజీ కాటన్ మిల్లు కార్యకలాపాలను పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై వివరాలు తెలుసుకున్నారు.

**తుది బిల్లు మంజూరుకు ఆదేశం**

మార్చల గ్రామంలో ఆవంచ వెంకటయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ పరిశీలించారు.ఇంటి నిర్మాణం పూర్తయి, లబ్ధిదారుడు నివాసం ఉంటున్న తీరును గమనించారు.ఇప్పటివరకు బిల్లులన్నీ మంజూరయ్యాయని,తుది బిల్లు పెండింగ్‌లో ఉందని వెంకటయ్య వివరించారు. స్పందించిన కలెక్టర్,తుది బిల్లు మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లించాలని సూచించారు.



**చిన్నారులకు పౌష్టికాహారంపై ఆరా..**

అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరు, వారికి అందిస్తున్న పౌష్టికాహారం,కేంద్రం నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలకు పౌష్టికాహారం కీలకమని పేర్కొంటూ,వారికి అందించే సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. కేంద్రం నిర్వహణ,చిన్నారుల హాజరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

**కాటన్ మిల్లులో పత్తి సేకరణ పరిశీలన**

గ్రామ పరిధిలోని బాలాజీ కాటన్ మిల్లును సందర్శించిన కలెక్టర్,రైతుల నుంచి రోజూ సేకరిస్తున్న పత్తి పరిమాణం,దాని నిల్వ, ప్రాసెసింగ్ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# వెయ్యేళ్ల నాటి ప్రాచీన 'శంభు' క్షేత్రానికి పునర్వైభవం

**నంగునూరు, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వెయ్యేళ్ల ప్రాచీన చరిత్ర కలిగిన శ్రీ శంభు దేవాలయ పునర్నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. శృంగేరి జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతి మహాస్వామివారు నిర్ణయించిన శుభముహూర్తం ప్రకారం నవంబర్ 20న ఉదయం 9.30 గంటలకు పునర్నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ జనమంచి సీతారామ శర్మ ద్వివేది తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామివారి దివ్య ఆశీస్సులతో, శ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామివారి పర్యవేక్షణలో కర్ణాటకలోని శృంగేరి పీఠంలో 'లక్ష్మీ గణపతి పురశ్చరణ యాగం' విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. దేవాలయ పునర్నిర్మాణ క్రతువు విఘ్నాలు లేకుండా సాగాలని కోరుతూ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. శిలాన్యాసం (శంకుస్థాపన) కోసం జగద్గురువులు స్వయంగా పూజించిన శిలలను అందజేసి అనుగ్రహించారని, ఇది పాలమాకుల గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులకు ఎంతో విశిష్టమైన వేడుక అని చెప్పారు. మన ప్రాంతంలో ఉన్న ఈ ప్రాచీన ఆలయాన్ని పునర్నిర్మించడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించే అరుదైన అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు.



**భక్తులు, దాతలు భాగస్వాములు కావాలి**

దేవాలయ పునర్నిర్మాణం కేవలం ఒక కట్టడం నిర్మించడం మాత్రమే కాదని, మన ప్రాచీన ధర్మాన్ని పరిరక్షించే పవిత్ర కార్యమని సీతారామ శర్మ పేర్కొన్నారు. ఈ పుణ్యకార్యంలో భక్తులు, దాతలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. నవంబర్ 20న జరిగే ఈ కార్యక్రమానికి భక్తజనం విశేషంగా తరలివచ్చి శ్రీ శంభు స్వామివారి కృపతో పాటు శృంగేరి జగద్గురువుల ఆశీస్సులు పొందాలని కోరారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- **ఇద్దరి అరెస్ట్, బైకులు, నగదు స్వాధీనం**



**మక్తల్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్ని శివారు ప్రాంతంలో అక్రమంగా పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మక్తల్ పోలీసులు దాడి నిర్వహించి, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ని శివారులో రహస్యంగా పేకాట నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతంపై దాడి చేశారు. ఈ దాడిలో పట్టుబడిన వారితో పాటు మరికొంత మందిపై మక్తల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 448/2026 నమోదు చేశారు. తెలంగాణ గేమింగ్ యాక్ట్ సెక్షన్ 9(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి పోలీసులు సంఘటన స్థలంలోరూ. 1,800 నగదు, 3 మొబైల్ ఫోన్లు, 8 బైకులు, ?పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు అక్రమ పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడవద్దని మక్తల్ పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**వనపర్తి రూరల్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నవంబర్ 6వ తేదీ ఓటు నమోదు ప్రక్రియకు చివరి తేదీ కావడంతో రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల స్థాయి నాయకులు ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వనపర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, ముఖ్యంగా నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ అమలుపై అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని భావించి నిర్లక్ష్యం చేయకుండా, ఓటు నమోదు ప్రక్రియపై మరింత శ్రద్ధ వహించాలని కోరారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి అవగాహన కల్పించి, నిర్ణీత గడువులోగా ఓటు నమోదు పూర్తయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆదేశించారు.

**త్వరలో వనపర్తికి మాజీ మంత్రి హరీశ్ రావు**

పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతున్న రైతులకు పరామర్శ.. అండగా నిలవనున్న బీఆర్ఎస్ విద్యుత్ కోతలు, సాగునీటి కొరత కారణంగా వరి పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను పరామర్శించేందుకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు త్వరలో వనపర్తి నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు నిరంజన్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందుచూపు లేని విధానాల వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆయన విమర్శించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సాగునీరు అందక వందలాది ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టి పంటల సాగు చేపట్టిన రైతులు నష్టాల బారిన పడుతున్నారని, వారి కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో పంటలు ఎండిపోయి ఆందోళనలో ఉన్న రైతులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, వారికి ఆత్మస్థైర్యం కల్పించేందుకు హరీశ్ రావు పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా, పట్టణ, మండల స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఒకవైపు పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పాటు, మరోవైపు రైతాంగ సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు నిరంజన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా, పట్టణ, మండల అధ్యక్షులతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మంగళవారం
27 అక్టోబర్ 2026
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# గదుల్లో సరిపడా స్థలం లేక ఖాళీ స్థలంలో ఫర్నీచర్ పెట్టాం

- జనంసాక్షి కథనానికి జిల్లా సంక్షేమాధికారిణి మల్లేశ్వరి వివరణ


కలెక్టరేట్‌లో చెత్తకుప్పలుగా ఫర్నీచర్!

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): గదుల్లో సరిపడా స్థలం లేక ఖాళీ స్థలంలో ఫర్నీచర్ పెట్టడం జరిగిందని జిల్లా సంక్షేమాధికారిణి మల్లేశ్వరి 'జనంసాక్షి' కి వివరణ ఇచ్చారు. 'కలెక్టరేట్‌లో చెత్తకుప్పలుగా ఫర్నిచర్' అనే కథనం 'జనంసాక్షి' లో ఈ నెల 25న ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా 'జనంసాక్షి' కథనానికి స్పందించిన సంక్షేమాధికారి స్పందించి వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమ వారం ఆమె 'జనంసాక్షి' తో మాట్లా డుతూ ఫర్నీచర్ ఖాళీ స్థలంలో ఉన్న విషయం వాస్తవమేనని, కలెక్టరేట్ భవన సముదాయంలోని బాల రక్ష భవన్‌లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యుసీ), జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ), చైల్డ్ హెల్ప్ లైన్ - 1098 తదితర విభాగాలు పని చేస్తున్నాయని, ఈ విభాగాల నిర్వహణకు సరి పడా కార్యాలయ గదులు, స్థలం అందుబాటులో



లేదన్నారు. ఫర్నిచర్, ఇతర సామగ్రిని కార్యాలయం లోపల ఉంచ దానికి స్థలం సరిపోక పోవడం కారణంగా కార్యాల యం వెనుకవైపు ఉన్న ఖాళీ ప్రదే శంలో మిగిలిన సామగ్రిని తాత్కా లికంగా పెట్టడం జరిగిందని, ప్రభుత్వ ఆస్తులను పాడుచేయడం లేదా నిర్లక్ష్యం చేయడం తమ శాఖ ఉద్దేశం కాదని, కార్యాలయ స్థలాభావం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆమె వివరించారు.

# రామప్ప దేవాలయ భూములు భద్రమేనా?

- కౌలు లెక్కల్లో అనుమానాలు
- భూముల హద్దులపై సందేహాలు
- తగ్గుముఖం పడుతున్న విస్తీర్ణం
- సర్వే చేస్తేనే అనుమానాలకు తెర



వెంకటాపూర్ (రామప్ప), అక్టోబర్ 26(జనం సాక్షి): ప్రపంచ వారసత్వ సంపద,యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయానికి చెందిన ఇనాం భూములు భద్రంగా ఉన్నాయా..? అనే ప్రశ్న ప్రస్తుతం చర్చనీయాం శంగా మారింది. ఆలయ నిర్వహణ, ధూపదీప నైవేద్యాల కోసం పూర్వం కేటాయించిన ఈ భూముల విషయంలో కొన్ని అనుమానాలు ప్రస్తుతం స్థానిక ప్రజలతోపాటు శివ భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి. దేవాదాయ, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితికి మధ్య తేడా ఉందనే సందేహాన్ని స్థానికులు, భక్తులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయంపై అధికారులు స్పష్టత ఇస్తేనే అసలు వాస్తవాలు బయటకు వస్తాయి.

### కౌలు నిర్వహణపై అనుమానాలు

రామప్ప దేవాలయానికి చెందిన ఇనాం భూములను దేవాదాయ శాఖ కౌలుకు ఇస్తూ వస్తోంది. అయితే ఈ కౌలు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందా అనే ప్రశ్న సైతం ప్రస్తుతం స్థానికుల్లో తలెత్తుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి ఏటా సదరు భూములను బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇవ్వాలి. కానీ, కొన్ని చోట్ల కొంతమంది వ్యక్తులు మాత్రమే ఎప్పటికీ వారే ఆలయ భూములను కౌలుకు చేస్తున్నారు. దీనివల్ల ఆలయానికి రావాల్సిన ఆదాయం తగ్గుతుందేమోననే అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అసలు కౌలు ఎంత వసూలు అవుతోంది, ఆ నిధులు ఎలా వినియోగిస్తున్నారు అనే వివరాలపై స్పష్టత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

### హద్దురాళ్లు, విస్తీర్ణంపై సందేహాలు

రామప్ప ఇనాం భూములకు సంబంధించి మరో అనుమానం హద్దురాళ్ల విషయంలో వ్యక్తమవుతోంది. గతంలో వేసిన హద్దురాళ్లు కొన్ని సదరు భూముల్లో కనిపించడం లేదనే ప్రచారం జరుగుతోంది. దీనివల్ల భూముల విస్తీర్ణం తగ్గుతుందేమోననే సందేహం సైతం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే దేవాలయ పరిసరాల్లో కొన్ని చోట్ల ఇనాం భూములను కొంతమంది అక్రమించు కున్నట్టు సమాచారం. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి, పాత రికార్డులతో పోల్చి చూస్తేనే వాస్తవ పరిస్థితి తెలుస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

### సర్వే చేస్తేనే అసలు విషయం వెలుగులోకి..

ఈ నేపథ్యంలో రామప్ప దేవాలయ ఇనాం భూములపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. రామప్ప దేవాలయానికి నిజంగా ఎంత ఇనాం భూమి ఉంది, ఎక్కడెక్కడ ఉంది, వాటి సర్వే నంబర్లు ఏమిటి, ప్రస్తుత విస్తీర్ణం ఎంత అనే వివరాలను బహిరంగంగా ప్రకటించాలని పలువురు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా ములుగు జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రామప్ప ఇనాం భూములపై సర్వే చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా సర్వే అనంతరం ఇనాం భూముల్లో హద్దురాళ్లు వేసి సదరు భూముల వివరాల లెక్క తేల్చాలని పలువురు కోరుతున్నారు. అప్పుడే రామప్ప ఇనాం భూములపై స్థానికుల్లో ఉన్న అనుమానాలకు తెరపడుతుంది. దేవుడి భూములు భద్రంగా ఉన్నాయని భక్తుల్లో సైతం భరోసా కలుగుతుంది. అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి మరీ.

# తెలంగాణ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా గాదె సాయిశ్రీ

- పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్న గ్రామీణ యువతి
- తల్లిదండ్రుల కృషికి దక్కిన గౌరవం



రేగొండ(కొత్తపల్లిగోరి),అక్టోబర్ 26 (జనం సాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన గాదె సాయిశ్రీ తెలంగాణ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు అయ్యారు. గాదె వీరస్వామి, సవిత దంపతుల కుమార్తె అయిన సాయిశ్రీ తన పట్టుదల, కృషితో న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టి కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. సాధారణ గ్రామీణ కుటుంబం నుంచి వచ్చిన సాయిశ్రీ న్యాయవిద్యను అభ్యసించి, న్యాయవాదిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించడం విశేషం. ఆమె సాధించిన ఈ విజయం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారం, తన నిరంతర శ్రమ కీలకంగా నిలిచాయి. న్యాయవాదిగా నమోదు కావడం ఆమె జీవితంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులు కూడా పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని సాయిశ్రీ విజయం నిరూపిస్తోంది. ముఖ్యంగా మహిళలు విద్యను ఆయుధంగా చేసుకుని తమకు నచ్చిన రంగాల్లో రాణించవచ్చని ఆమె ప్రయాణం స్ఫూర్తినిస్తోంది. కుమార్తె న్యాయవాదిగా గుర్తింపు పొందడంతో తల్లిదండ్రులు వీరస్వామి, సవిత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాయిశ్రీ సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. భవిష్యత్తులో న్యాయవాదిగా ప్రజలకు న్యాయపరమైన సేవలందిస్తూ, బాధితులకు అండగా నిలిచి, వృత్తిలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. సాయిశ్రీ తన ప్రతిభతో మరింత గుర్తింపు తెచ్చుకుని ఇతర యువతులకు ఆదర్శంగా నిలవాలని కోరుతున్నారు.గ్రామీణ నేపథ్యం విజయానికి అడ్డంకి కాదని, దృఢమైన సంకల్పం, క్రమశిక్షణ, నిరంతర కృషి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని గాదె సాయిశ్రీ విజయం చాటిచెబుతోంది.

# ప్రజావాణిలో అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి



వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 153 అర్జీలను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 55, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 24, డీఆర్‌డీఏకు 8, హౌసింగ్ శాఖకు 11 అర్జీలు రాగా, ఇతర శాఖలకు సంబంధించి మరో 55 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

### వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ శాఖలకు సంబంధిం చిన సమస్యలతో పాటు వృద్ధులు తమ సమస్యల పరిష్కారం కోసం అధిక సంఖ్యలో అర్జీలు సమర్పించారు. వృద్ధులకు సంబంధిం చిన అర్జీలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించి, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత సంక్షేమ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణికి వచ్చిన ఓ వృద్ధుడి పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మానవత్వంతో స్పందించారు. ఆ వృద్ధుడికి టీషర్ట్, జూట్ బ్యాగ్ అందించి తన ఆప్యాయతను చాటుకున్నారు. కలెక్టర్ చూపిన మానవత్వానికి వృద్ధుడు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. అదే సమయంలో వృద్ధుడి సమస్యను పరిష్కరిం చేందుకు సంబంధిత అధికారికి అర్జీని ఎండార్స్ చేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం చూపడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని, అధికారులు అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈఓ వసంత, హౌసింగ్ పీడీ విష్ణు వర్ధన్ రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజిరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఎండిన పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్ భూమేష్ మిశ్రా

కడెం, అక్టోబర్ 26(జనం సాక్షి) : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కొత్త మద్దిపడగ, పాత మద్దిపడగ గ్రామాల సమీపంలో సదర్మాట్ కాలువ సాగునీరు అందక ఎండిపోయిన పంట పొలాలను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో గల పంట పొలాలను స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. సదర్మాట్ బ్యారేజీలో ప్రస్తుతం ఒక టీఎంసీ వరకు నీరు నిలువ ఉందని వాటిని రైతుల పంట పొలాలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. సదర్మాట్ కాలువ పైన గల తుమ్మ వద్ద రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి సాగునీరు కిందికి అందేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరో 20 రోజుల వరకు సాగునీరు పూర్తిస్థాయిలో అందితే పంటలు పండుతాయని రైతులు కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో పాత, కొత్త మద్ది పడగల సర్పంచులు శకుంతల రామా గౌడ్, ఈ ఈ ప్రవీణ్ కుమార్, డి ఈ వీరయ్య, తాసిల్దార్ మొహీనుద్దీన్, ఎంపీడీవో అరుణ పలువురు అధికారులు స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

- రాష్ట్ర అధ్యక్షుడు బాలల హక్కుల ప్రజా వేదికవలస సుభాష్ చంద్రబోస్



బెల్లంపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 14 బాలల దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 14 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు 34 రంగాలలో ప్రతిభ కలిగిన వారికి రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు ప్రధానం హైదరాబాదులో ఏర్పాటు చేస్తున్నట్టు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు వివరించారు. విద్యార్థులు దేశభక్తి పాటలు, భరతనాట్యం, గిటార్, కీబోర్డు ప్లేయింగ్, ఫ్లూటు, పర్వతాహోరణ, యోగా, చిత్రలేఖనం, కార్టూన్స్, కవిత్వం, జానపద నృత్యం, జానపద పాటలు, మిమిక్రీ, మ్యాజిక్, సైకిలింగ్, వాలీబాల్, కబడ్డీ, కోకో బ్యాట్మెంటన్, చెస్, ఫుట్బాల్, రన్నింగ్, జాతీయ సమైక్యత శిబిరం, కరాటే, కూచిపూడి, కోలాటం, తబలా, బతుకమ్మ, స్విమ్మింగ్, బాస్కెట్బాల్, స్కిటింగ్, టెన్నిస్, అర్చరి రంగాలలో నైపుణ్యం గల విద్యార్థులకు వారి వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్లు ఆధారంగా బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. దరఖాస్తు చివరి తేదీ 5.11.2026 రోజు వరకు సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరించబడుతుందని, నైపుణ్యం గల విద్యార్థులు వారి వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్లు, ప్రెస్ క్లిప్పింగ్, బయోడేటా దరఖాస్తుకు ఫోటో జత చేసి వారి దరఖాస్తును పోస్ట్ ద్వారా పంపించాలన్నారు. చిరునామా : వలస సుభాష్ చంద్ర బోస్, రాష్ట్ర అధ్యక్షులు బాలల హక్కుల ప్రజా వేదిక. ఇంటి నెంబర్ 2-92 గ్రామము. కూరెల్ల. మండలం కోహెడ. జిల్లా సిద్దిపేట .పిన్ నెంబర్ 505473 పంపించాలన్నారు.

# సత్యనిష్ఠతో సమృద్ధి - అవినీతి రహిత సమాజమే లక్ష్యం

- వరంగల్ సీపీ ఎన్. శ్వేత



హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 26 (జనం సాక్షి) : భారతదేశ తొలి ఉపప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి నవంబర్-1వ తేదీని పురస్కరించుకుని జాతీయ ఐక్యత, సమగ్రత, దేశ సమైక్యత ప్రాధాన్యతను చాటిచెప్పేలా "సత్యనిష్ఠతో సమృద్ధి" అనే ఇతివృత్తం: తో అక్టోబర్ 26 నుండి నవంబర్ 1 వరకు నిర్వహిస్తున్న జాగరూకత అవగాహన వారోత్స వాల్లో భాగంగా, సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. జాతీయ ఐక్యతను బలో పేతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్ర మంలో ఎఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మదుసుధన్, హన్మకొండ ఏసీపీ నరసిం హారావు, సిసిఎస్ ఏసీపీ సదయ్య, ఎఆర్ ఏసీపీలు సుదీంద్ర, నాగయ్య, అంతయ్య, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, శ్రీదర్, చంద్రశేఖర్ తో పాటు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్టు




బెల్లంపల్లి, అక్టోబర్ 26, (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరుతున్న ఉద్యమకారులను బెల్లంపల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈసందర్భంగా అరెస్టు అయిన ఉద్యమకారులు మాట్లాడుతూ ఇలా అక్రమ అరెస్టు చేయడం, నిర్బంధించడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసులు సైతం లెక్కచేయకుండా తెలంగాణ సాధన కోసం కష్టపడి పని చేసిన తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యమకారులకు కల్లిబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిందని, మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం అయిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో తెలంగాణ ఉద్యమకారులు ఎలిగేటి శ్రీనివాస్, పసులేటి వెంకటేష్, ఎరుకల సుందర్రావు, పరిష రవిశ్వర్, విజ్జగిరి రాజేందర్, చిట్యాల మధు, శంకర్ సింగ్ ఉన్నారు.

# వచ్చే నెల 23 నుండి 27 వరకు బుగులోని వెంకన్న జాతర

- ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే,కలెక్టర్
- రూ.8.75 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు
- రూ.4 కోట్లతో జాతర నిర్వహణ
- అన్ని శాఖల అధికారులకు దాహానిర్దేశం చేసిన ఎమ్మెల్యే గండ్ర ,కలెక్టర్ రాహుల్ శర్మ



రేగొండ, అక్టోబర్ 26 (జనంసాక్షి): మండలం తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. సోమవారం భూపాలపల్లి ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి దేవాదాయ, పంచాయతి రాజ్, విద్యుత్తు, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యుఎస్, వైద్య, రవాణా, పోలీస్, అగ్నిమాపక, అటవీశాఖ ల అధికారులతో జాతర ఏర్పాట్లు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 23 నుంచి 27 వరకు నిర్వహించనున్న జాతర మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జాతర నిర్వహణకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. గతంలో మంజూరైన కోనేరు బావి, శాశ్వత కల్యాణ మండపం నిర్మాణం, విద్యుత్తు లైట్లు, పైప్‌లైన్, మెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 8.75 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులను వేగవంతం చేయాలని తెలిపారు.జాతరకు వచ్చే రహదారులను మరమ్మతు చేసి భక్తుల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు.

జాతర ప్రాంతంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతుల కోసం అవసరమైన ప్రతిపాదనలను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. రూ.4 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు అవసరమైన 2.5 ఎకరాల అటవీ భూమిని రెవెన్యూ భూమితో మార్పిడి చేసి కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని, అటవీ భూముల మళ్లింపునకు సంబంధించిన త్రీడీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా వారం రోజుల్లోగా చర్యలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు కొండపైకి వెళ్ళడానికి అనువుగా వెదురు తడికలతో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. మన జిల్లాతో పాటు ఇతర జిల్లాలు నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నిరంతర తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బోర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ పథకాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ వంటి పనులను ముందస్తుగానే చేపట్టాలని తెలిపారు. జాతర సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలన్నారు.జాతర ప్రాంతానికి చేరుకునే మార్గాల్లో రహదారుల మరమ్మతులు, భక్తుల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దిష్ట బాధ్యతలు కేటాయించుకుని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమష్టి కృషితో బిగులోని జాతర మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ లో భాగంగా ఆర్టీసీ, పోలీస్, దేవాదాయశాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి స్టాళ్ల ఏర్పాట్లుకు మార్కింగ్ ఇవ్వాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి కిష్టా గౌడ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, దేవాలయ ఈఓ శ్రీనివాస్, పంచాయతి రాజ్, విద్యుత్తు, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యుఎస్, వైద్య, రవాణా, పోలీస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
27 అక్టోబర్ 2026

# ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలంటే రైతులు ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీరు అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తే గిట్టుబాటు ధరతో పాటు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2026 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

### గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2,461 మద్దతు ధర

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,461, సాధారణ రకం ధాన్యానికి రూ. 2,441 మద్దతు ధర ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు. సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.



### డిమాండ్ ఉన్న పంటల సాగుతో అధిక లాభాలు

మార్కెట్‌లో సన్నధాన్యానికి అధిక డిమాండ్ ఉండటంతో మిల్లర్లు రైతుల పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. దొడ్డు ధాన్యంతో పోలిస్తే సన్నధాన్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధర కూడా మెరుగ్గా లభిస్తోందని పేర్కొన్నారు. రైతులు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ సమావేశాలకు హాజరై వ్యవసాయ నిపుణుల సూచనలు పొందాలని కోరారు. సమిష్టి వ్యవసాయం చేసే రైతులకు, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే వారికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

### ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్ మాదిరిగానే ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తుందని తెలిపారు. సన్నధాన్యంలో ప్రభుత్వం ఏడు రకాలను సూచించిందని, సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, ఆదర్శ రైతు రామిరెడ్డి, నల్లగొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, జిల్లా సహకార అధికారి మమత, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ హైమావతి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలి

- స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు



**నూతనకల్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మండల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా, ప్రతి గ్రామంలోని ప్రజా సమస్యను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల సమీక్ష సామర్థ్య వృద్ధి మండల సమావేశానికి హాజరై వారు మాట్లాడారు. మండల కేంద్రంలోని సమస్యలపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకృతమవుతుందని,కానీ మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు కూడా త్వరితగతిన పరిష్కారం కావాలన్నది ఈ సమీక్ష సమావేశ ప్రధాన ఉద్దేశం అని స్పష్టం చేశారు. గ్రామాల వారీగా రహదారులు,తాగునీరు,విద్యుత్,పారిశుద్ధ్యం మౌలిక వసతులకు ప్రధాన్యత ఇస్తూ నిధులు కేటాయింపులు ఉంటాయని తెలిపారు సమస్యలను కేవలం గుర్తించి వదిలేయకుండా నిర్నిత గడువులోగా పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ నైజం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎంఏ భారతి, ఎంపీడీవో సునీత పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి,ఏఎంసి వైస్ చైర్మన్ వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దోషుల వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదు

- మీడియా పరంగా చర్యలు తీసుకుంటాం
- బాధిత కుటుంబానికి స్థలము ఇల్లు మంజూరు చేస్తాం
- బాధితులకు తప్పక న్యాయం చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** అనంతుల లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ఆదివారం రాత్రి చుంచుపల్లిలో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయంలో పద్మశాలి సంక్షేమ సంఘం పాల్వంచ కొత్తగూడెం నాయకులతో వచ్చిన బాధితులతో మాట్లాడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంటనే జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కు ఫోన్ చేసి అనంతుల లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులు ఎంతటి వారైనా వారి వెనుక ఎవరున్నా గాని వదిలిపెట్టకుండా సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం సివిల్ సప్లై కమిషనర్తో సైతం మాట్లాడి కుటుంబానికి ఏ రకమైన ఉపాధి అవకాశాలను అందించాలో పరిశీలించాలని కోరారు. బాధితులకు ఎటువంటి గృహ సదుపాయం లాంటివి లేవని తెలుసుకొని వారికి స్థలాన్ని ఇంటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కుటుంబానికి ఆర్థిక సహాయం అందించే విధంగా ఎక్స్‌గ్రేషియాను కూడా పరిశీలిస్తామని అన్నారు. నిందితులైన జర్నలిస్టులకు సంబంధించి వారి అక్రిడేషన్లు రద్దు చేస్తామని అక్రిడేషన్లో కమిటీ లో ఉన్న వారిని సైతం మీడియా పరంగా పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు ఎర్రగుంట సాంబశివరావు, గుండు రవికుమార్, ఇమంది ఉదయ్ కుమార్, పిండిపోలు కన్నయ్య బొమ్మ రామ కిషోర్, వేముల సతీష్, కేదాసి నవీన్, శ్రీనివాస్, శివకుమార్, మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానంతోనే మనిషి జీవితంలో మార్పు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** జ్ఞానంతోనే మనిషి జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సాధారణ జీవితం నుంచి ఉన్నత స్థాయికి ఎదగడానికి జ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. జ్ఞానాన్ని సంపాదించడంతో పాటు దానిని ఆచరణలో పెట్టినప్పుడే వ్యక్తిగతంగా, సామాజికంగా మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. మనలో మార్పు వస్తే సమాజంలోనూ మార్పు వస్తుందని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జీవితం నుంచి కరుణ, దయ వంటి గొప్ప విలువలను నేర్చుకోవాలని సూచించారు. మనుషులతో పాటు పశుపక్ష్యాదులకు కూడా ఈ ప్రపంచంలో జీవించే హక్కు ఉందని చెప్పారు. ప్రతి జీవిపై ప్రేమ, దయతో వ్యవహరించాలని, మానవత్వాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. వేల సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చిన రామాయణం నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. కాలంతో పాటు సాంకేతికత మారుతున్నా, మానవ విలువలు మాత్రం శాశ్వతంగా ఉంటాయని చెప్పారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమలోని చెడు లక్షణాలను తగ్గించుకుంటూ మంచి గుణాలను పెంపొందించుకోవాలని అన్నారు. అప్పుడే జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా,మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. భూ సమస్యలు,రెవిన్యూ కి సంబంధించి 53 దరఖాస్తులు, డిపిఓ 5, డిడబ్ల్యూఓ 5, డిఈఓ 5, పి హౌజింగ్ 5, మిగిలిన 28 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 101 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, సిపిఓ కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు హామీ




**భద్రాచలం, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హామీ ఇచ్చారు. తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం భద్రాచలం డివిజన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యూనియన్ జెండాను ఆవిష్కరించి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 2026 పీఆర్సీ అమలు, 1999 ఫిబ్రవరి నుంచి 2004 ఆగస్టు వరకు పనిచేసిన ఉద్యోగులను ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చడం, 2011 బ్యాచ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపుతో పాటు ఆర్టిజన్లు, కలెక్షన్ ఏజెన్సీ, స్పాట్ బిల్లర్లు, ఎస్‌పీఎం, అన్‌మ్యాన్డ్ కార్మికుల సమస్యలు, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. విద్యుత్ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఇదే అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని బూర్గంపహాడ్, ఎంపీ బంజర, సారపాక, దుమ్ముగూడెం, అశ్వాపురం, మొండికుంట, మణుగూరు, బయ్యారం, జానంపేట తదితర ప్రాంతాల్లోని సెక్షన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లోనూ యూనియన్ జెండాలను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు జి. సర్వేశ్వరరావుతో పాటు త్రినాథ్ రెడ్డి, ఏడుకొండలు, కోటేశ్వరరావు, విష్ణుమూర్తి, రమేష్ బాబు, కొకిరాల సత్యనారాయణ, అశోక్, అహ్మద్, శ్రీనివాసరాజు, సాబీర్, ఆదినారాయణ, పవన్ కుమార్, ప్రవీణ్, ప్రసాద్, మరియమ్మ తదితర యూనియన్ నాయకులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో 25.63 కిలోల గంజాయి పట్టివేత

- ద్విచక్ర వాహనం, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నలుగురు నిందితులు పట్టివేత



**భద్రాచలం, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 25.63 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి ద్విచక్ర వాహనం, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 14,11,500 ఉంటుందని అధికారులు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ. శశికుమారి ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే రహదారిలోని ఇసుక రీచ్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన హోండా షైన్ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 21.660 కిలోల ఎండు గంజాయి లభించింది. గంజాయిని మల్కాన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న కర్ణాటకలోని తుమకూరుకు చెందిన హెచ్.ఎన్. ప్రేమ్‌సాగర్, హిందూపురానికి చెందిన భార్గవను పట్టుకున్నారు. అదే ప్రాంతంలో మరో ఇద్దరిని తనిఖీ చేయగా వారి వద్ద 3.970 కిలోల ఎండు గంజాయి లభించింది. కలిమెల నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న సరూర్‌నగర్‌కు చెందిన ఎస్.డి. సోహైల్, రాజేంద్రనగర్‌కు చెందిన ఎం.డి. మొహసిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. రెండు కేసుల్లో కలిపి మొత్తం 25.630 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, కానిస్టేబుళ్లు రాజు, వెంకన్న, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్, డ్రైవర్ సాయిరామ్ పాల్గొన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 18004252523 కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ శశికుమారి తెలిపారు.

# యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలనే సాగు చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**ఖమ్మం/రఘునాథపాలెం, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సోమవారం రఘునాథపాలెం మండలంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు.

### రఘునాథపాలెం మండలానికి సాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు

కృష్ణా, గోదావరి నదులకు దూరంగా ఉన్న రఘునాథపాలెం మండలంలో గిరిజన జనాభా అధికంగా నివసిస్తోందని మంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలను మెరుగు పరిచేందుకు వెంకటాయపాలెం డీప్ కట్ నుంచి మంచుకొండ లిఫ్ట్ ద్వారా 25 చెరువులకు నీటిని అందించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. బుగ్గవాగు నుంచి మరో 11 చెరువులకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 46 మండలాల్లో రఘునాథపాలెం మండలానికి మాత్రమే సాగునీటి సౌకర్యాలు పరిమితంగా ఉన్నాయని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం మండలంలోని కొంత ప్రాంతానికి నీరు అందుతోందని వివరించారు. వచ్చే సీజన్ నుంచి బుగ్గవాగు నీటిని కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా రైతులు కూరగాయలు, తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు.

### అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రఘునాథపాలెం మండలంలో మొదటి విడతలో 1,300 పైగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రెండవ విడతలో మరో 1,100 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

### రైతుల పొలాలకు రహదారుల నిర్మాణానికి రూ.100 కోట్లు

రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేందుకు రహదారుల నిర్మాణం కోసం ఇప్పటికే రూ. 75 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. త్వరలో మరో రూ. 25 కోట్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో రైతుల పొలాలకు రహదారుల నిర్మాణానికి మొత్తం రూ. 100 కోట్ల మేర నిధులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

వీబీ-జీ రామ్‌జీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, ఇరిగేషన్ డీఈ మోతీలాల్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలో నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నారు, ఎంత మంది పట్టభద్రులకు దరఖాస్తు ఫారాలు అందించారు అని వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తరఫున ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, పట్టభద్రుల నమోదు కోసం సమన్వయంతో కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్, సర్పంచులు కందిమల్ల గోపాల్ రెడ్డి, మారేపల్లి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ లు మోటె రమేష్, నడిగోటి పాండు నాయకులు గుత్త నర్సిరెడ్డి, జినుకల ప్రభాకర్, బత్తుల కృష్ణ, కొత్తపల్లి అబ్రహం కుమార్, సాల్వేర్ అశోక్, జెల్ల వెంకటేష్, వనం చంద్రశేఖర్, ఎండి అక్రమ్, పిట్ట వెంకట్ రెడ్డి, రాముని రమేష్,, శంభాల వెంకటేష్, కోట సుధాకర్, కుమ్ము శేఖర్,బత్తుల నవీన్ కుమార్, ఎర్ర శేఖర్, నోముల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



## వాల్మీకి ఆశయాలు ఆదర్శం

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్..**

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (జనంసాక్షి):** మహర్షి వాల్మీకి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజంలో నైతిక విలువలు, సమానత్వం, మానవతా భావాలను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, ధర్మం, నైతిక విలువలు, మానవతా సూత్రాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. వాల్మీకి జీవితం, ఆయన బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహనీయుల జీవిత చరిత్రలు, వారి బోధనలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి. విక్టర్, ఎన్.వై. గిరి, జెడ్పీ సీఈఓ చందర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నర్సయ్య, సహాయ బీసీ అభివృద్ధి అధికారి మామిండ్ల చక్రధర్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నీల నాగరాజు, ఎంబీసీ నాయకులు శ్రీనివాస్, జనార్ధన్, గణేశ్ నాయక్, వివిధ శాఖల అధికారులు, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి

- **ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి**
- **అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 121 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రశేఖర్లతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, పెండింగ్ అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇదిలాఉండగా, ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడం, కొంతమంది ఆలస్యంగా హాజరు కావడాన్ని గమనించిన కలెక్టర్, ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అయ్యే నిర్ణీత సమయం ఉదయం 10.30 గంటల వరకు అధికారులు అందరూ హాజరు అయి ఉండాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా కార్యస్థానం విడిచి వెళ్లవద్దని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నెలకొని ఉన్న పరిస్థితుల గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు అవగాహన సదస్సులలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

**- రాజస్థాన్‌లో ప్రధాన నిందితుడి అరెస్ట్..**
**రూ.25.45 లక్షల చోరీ కేసు**
**ఛేదించిన కామారెడ్డి పోలీసులు**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (జనంసాక్షి):గాంధారి ఎస్‌బీఐ ఏటీఎంలో భారీ చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా గుట్టును కామారెడ్డి పోలీసులు ఛేదించారు. రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితుడు రషీద్ (30)ను రాజస్థాన్‌లో అరెస్ట్ చేసి కామారెడ్డికి తరలించారు. ఏటీఎంలో గ్యాస్ కట్టర్‌తో యంత్రాన్ని ధ్వంసం చేసి ఐదు నగదు బాక్సులను అపహరించిన ముఠా నుంచి నగదు, స్కార్పియో వాహనం, గ్యాస్ కట్టింగ్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, కత్తులు, ఇనుప రాడ్లు, నకిలీ నంబర్ ప్లేట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గాంధారి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో అక్టోబర్ 10-11 అర్ధరాత్రి నిందితులు మాస్కులు, క్యాప్‌లు, నైటీలు ధరించి చోరీకి పాల్పడ్డారు. ముందుగా వెల్డింగ్ షాప్ తాళం పగలగొట్టి ఆక్సిజన్ సిలిండర్, ఇతర పరికరాలను దొంగిలించి, అనంతరం ఏటీఎం వద్దకు చేరుకున్నారు. సీసీ కెమెరాలపై నల్ల స్ప్రే వేసి పనిచేయకుండా చేసి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి రూ.25, 45,900 నగదుతో ఉన్న ఐదు బాక్సులను స్కార్పియోలో తీసుకెళ్లారు.

**ఐదు ప్రత్యేక బృందాలతో గాలింపు**

కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాలతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితులు ఉపయోగించిన నల్లరంగు స్కార్పియోను గుర్తించారు. నిందితులు వాహనానికి వేర్వేరు నంబర్ ప్లేట్లు మార్చుకుంటూ పోలీసులను తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో తేలింది.

**రాజస్థాన్‌లో అరెస్ట్:**

నిందితులు మహారాష్ట్ర మీదుగా రాజస్థాన్‌కు పారిపోయినట్లు గుర్తించిన పోలీసులు అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకున్నారు. చేచాట్ పోలీసులు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా టైరు దెబ్బతినడంతో నిందితులు వాహనాన్ని వదిలి నగదుతో పరారయ్యారు. ప్రత్యేక బృందాలు రాజస్థాన్‌లో గాలింపు కొనసాగించి అక్టోబర్ 20న బరోడామేవ్ సమీపంలో బస్సు కోసం వేచి ఉన్న రషీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్సిట్ వారెంట్‌పై అతడిని కామారెడ్డికి తరలించారు.నిందితుడి నుంచి రూ.29,400 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, నల్లరంగు స్కార్పియో, గ్యాస్ కట్టింగ్ పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్ పరికరాలు, వివిధ నంబర్ ప్లేట్లు, మాస్కులు, దుస్తులు, మూడు ఇనుప కత్తులు, ఇనుప రాడ్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్‌లో కరీంనగర్ ప్రాంతంలోని రెండు ఎస్‌బీఐ ఏటీఎంల వద్ద కూడా ఇదే ముఠా చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.అరెస్టు చేసిన రషీద్‌ను అక్టోబర్ 26న న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను త్వరలో పట్టుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, పుష్పరాజ్, ఐటీ కోర్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సీసీఎస్ సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మీకాంత్, సదాశివనగర్ కానిస్టేబుల్ అజార్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



## 'సర్'లో వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలి

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**
**- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**
**నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**

పెద్దపల్లి,అక్టోబర్ 26(జనంసాక్షి) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి అంశాన్ని పక్కాగా నమోదు చేయాలని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములుతో కలిసి సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఎదైన సమాచారం అడిగిన వెంటనే వివరాలు అందించేందుకు అవసరమైన రికార్డులు, ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్లను చేర్చడానికి లేదా తొలగించడానికి సంబంధించి తగిన ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలను తప్పనిసరిగా భద్రపరచాలని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలి ఉన్న సుమారు 4.50 లక్షల పెండింగ్ పనులను రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో, ఈ వారం చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్ఐఆర్ నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను ముగించాలని ఆదేశించారు.అనర్హులుగా గుర్తించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణాలు, తగిన డాక్యుమెంట్లు, ఆధారాలను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తుల ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చినట్లు తెలిపారు. అనర్హతకు సంబంధించిన ఆధారాలను రాజకీయ పార్టీలు,ఆర్‌టీఐ దరఖాస్తుదారులు లేదా ఇతరులు కోరినప్పుడు అందించేందుకు సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు.ఫారం-6,7,8దరఖాస్తుల పరిశీలనతో పాటు పెండింగ్ పనులను నవంబర్ 5వ తేదీ నాటికి పరిష్కరించాలని సూచించారు.ఈ దరఖాస్తులకు సంబంధించిన అవసరమైన పత్రాలు,ఆధారాలను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో ఈ.ఆర్.ఓ., బి.ఎల్.ఓ. స్థాయిల్లో అన్ని రికార్డులు, డాక్యుమెంట్లను భౌతికంగా,ఆన్‌లైన్‌లో భద్రంగా నిర్వహించాలని ఆదేశించారు.ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు సక్రమంగా నమోదయ్యేలా,అనర్హుల పేర్ల తొలగింపునకు సంబంధించి నిబంధనల ప్రకారం తగిన ఆధారాలు ఉండేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

**జనంసాక్షి:**8వ కాలనీ, 19వ డివిజన్‌లో రూ.1 కోటి 90 లక్షల వ్యయంతో 6 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, నగర మేయర్ మహంకాళి స్వామి ముఖ్య అతిథులుగా, 19వ డివిజన్ కార్పొరేటర్ మారెల్లి సుశీల అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.రామగుండం కార్పొరేషన్, సింగరేణి సంస్థ సహకారంతో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి కాలనీ ప్రజలకు



మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నగర అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములై సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు ఎం.డి. ముస్తఫా, కార్పొరేటర్లు శంకర్ నాయక్, అనుము స్వరూప రాములు, దేవనపల్లి చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జక్కుల దామోదర్, బండ రమేష్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్, మార్కరాజు, 8వ కాలనీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మేకల అజయ్, బీసీ సెల్, మెరుగు రాజేశం, యూత్ కాంగ్రెస్ నాయకుడు హరిహర, పరకాల ప్రశాంత్, పూజారి రాకేష్, బొల్లం రాజు, మోత్కు అవినాష్, చిరుకొండ అక్షయ్, మహిళా అధ్యక్షురాలు సునీతతో పాటు స్వరూప, మెరుగు సంధ్య, నర్మద, వివిధ విభాగాల అధ్యక్షులు, మహిళా నాయకులు, డివిజన్, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## క్రికెట్ శిక్షణకేంద్రంగా కామారెడ్డి స్టేడియం

**వారం రోజుల్లో ప్రైవేట్ కోచ్‌ల నియామకం.. మూడు ప్రాక్టీస్ నెట్స్ ఏర్పాటు**

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (జనంసాక్షి):** కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియాన్ని క్రికెట్ అభివృద్ధికి అనువుగా తీర్చిదిద్ది, స్థానిక యువతకు మెరుగైన శిక్షణ, క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రికెటర్లను తయారు చేయడానికి కృషి చేస్తామన్నారు.సోమవారం హెచ్ సి ఎ కార్యదర్శి జీవన్‌రెడ్డి, సీఈఓ ఇంతియాజ్‌ఖాన్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి ఇందిరాగాంధీ స్టేడియాన్ని షబ్బీర్ పరిశీలించారు. స్టేడియంలోని ప్రస్తుత వసతులు, పిచ్, ప్రాక్టీస్ నెట్స్ తదితర అంశాలను పరిశీలించి క్రికెట్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రతిభ ఉన్న విద్యార్థులు నాణ్యమైన క్రికెట్ శిక్షణకు దూరం కాకూడదన్నారు. హెచ్ సి ఎ సహకారంతో స్టేడియంలో ప్రైవేట్ కోచ్‌లను నియమించడంతో పాటు మూడు ప్రాక్టీస్ నెట్స్, అవసరమైన క్రీడా సామగ్రిని ఏర్పాటు చేస్తామన్నారు. నాణ్యమైన క్రికెట్ పిచ్‌ను నిర్మించి అండర్-19 స్థాయి మ్యాచ్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టేడియం భవిష్యత్తులో ప్రతిభావంతులైన క్రికెటర్లను తీర్చిదిద్దే శిక్షణా కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు.హెచ్ సి ఏ కార్యదర్శి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజుల్లోగా ప్రైవేట్ క్రికెట్ కోచ్‌ల నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడు ప్రాక్టీస్ నెట్స్, అవసరమైన క్రికెట్ సామగ్రిని సమకూరుస్తామన్నారు. త్వరలో జరిగే హెచ్ సి ఏ సమావేశంలో పిచ్ నిర్మాణం, స్టేడియం నిర్వహణ, అండర్-19 మ్యాచ్‌ల నిర్వహణపై చర్చిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రటరీ ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమా శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్, రాజాగౌడ్, రెడ్డి నాయక్, భూమని బాలరాజ్, గోనె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన అవసరం

**విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన లో మంథని సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ**

మంథని, అక్టోబర్ 26, (జనంసాక్షి) : విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు వారి భద్రతకు సంబంధించిన అంశాలను తెలియజేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంథని సీనియర్ సివిల్ జడ్జి మల్లాడి అపర్ణ విద్యార్థులకు పోక్సో చట్టం (లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం), బాలల హక్కులు, వారి రక్షణకు ఉన్న చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించారు. బాలలు తమకు ఎదురయ్యే సమస్యలపై భయపడకుండా స్పందించాలని, అన్యాయం జరిగినప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలల భద్రత, హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గీట్ల భరత్ రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. రఘోత్తం రెడ్డి, న్యాయవాదులు శశిభూషణ్ కాచే, గౌతమి శ్రీలక్ష్మి, వ్యాస్ కుమార్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## అభివృద్ధియే ధ్యేయం.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 26 (జనంసాక్షి):** నగర అభివృద్దే ధ్యేయంగా మా పాలకవర్గం పని చేస్తుందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలోని పలు డివిజన్లలో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. మొదటగా 2 వ డివిజన్ తీగలగుట్టపల్లి లో నగరపాలక సంస్థకు చెందిన 11 లక్షల సాధారణ నిధులతో ఎస్ డబ్లుజీ పైపులైన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. అనంతరం 32 వ డివిజన్ హుస్సేన్ పురలో స్థానిక కార్పోరేటర్ షేక్ యూసూఫ్ తో కలిసి 20 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. 34వ డివిజన్ హుస్సేన్ పురలో స్థానిక కార్పోరేటర్ సమీనా పర్వీన్ తో కలిసి యూఐడీఎఫ్ కు చెందిన 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. అనంతరం 1వ డివిజన్ ఆరెపల్లి లో స్థానిక కార్పోరేటర్ బారి అపర్ణ జితేంధర్ తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన 27 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. పనులు ప్రారంభోత్సవాలు చేసి, పనులు స్టాట్ చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో సలహాల సూచనల మేరకు అన్ని డివిజన్లను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. యూఐడిఎఫ్ కింది 50 కోట్లతో డివిజన్ల వారిగా అభివృద్ధి పనులు ప్రారంభించి ప్రజలకు కావల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒక వైపు నగరం మరో వైపు విలీన శివారు ప్రాంతాల డివిజన్ల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజలకు కావల్సిన వసతులు కల్పించి వారి అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పాలకవర్గం పని చేస్తుందని స్పష్టం చేశారు. పలువురు కార్పోరేటర్లు, అధికారులు, స్థానిక డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

## మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి,అక్టోబర్ 26(జనంసాక్షి) :** మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మహాకవి వాల్మీకి జయంతి పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఆదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తో కలిసి పాల్గొన్నారు.శ్రీ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మహాకవి వాల్మీకి హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని, రామాయణ గ్రంథం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని కలెక్టర్ పేర్కొన్నారు.రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు.మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగానే మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని కలెక్టర్ తెలిపారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుదైక కుటుంబం అనే భావన రామాయణం తో ముడిబడి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు.మహాకావ్యం రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండగగా జరుపుకోవడం సంతోషకరమని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం. రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ , బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర కనుసన్నల్లో ఎన్నికల కమిషన్

**ఓట్ల తొలగింపు అనేది అనైతిక చర్య**
**ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కాళేశ్వరం ప్రాజెక్టు**
**నుంచి ఎన్ని నీళ్లు ఇచ్చారో కేటీఆర్ చెప్పాలి**
**ప్రభుత్వ విప్, విజయరమణ రావు**



**పెద్దపల్లి,అక్టోబర్ 26(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ ఆర్ గార్డెన్స్ లో ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా చేపట్టిన " ఓట్ బచావో - దేశ్ బచావో " ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమ ఏఐసిసి పరిశీలకులు ఎస్. శరత్ టీపీసీసీ పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్, డీసీసీ అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు .ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషన్ మరియు జ్ఞానేశ్ కుమార్ అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో కూడా 73 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని ఓట్ల తొలగింపు అనేది అనైతిక చర్య అని అన్నారు. ఓటు అనేది దేశ పౌరుని హక్కు అని ఓటును తొలగించే హక్కు ఎవ్వరికీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలలో టిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఏ నియోజకవర్గానికి ఎన్ని నీళు వచ్చాయో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్ చెప్పాలని ప్రభుత్వ విప్ విజయరమణ రావు అన్నారు. కన్నెపల్లి నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు వృధాగా కిందికి పోతుందని ఆ నీటిని మళ్లించవచ్చని తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడు బ్యారేజీలు కట్టగా మేడిగడ్డ కూలగా అన్నారం సుందిళ్ల లీకేజీలైనాయని ఈ విషయంపై 2023లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాణ్యత లేని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులకు స్వయంగా కలిసి వినతి పత్రం కూడా అందించారు అన్నారు.ఈ ప్రాజెక్టులో నీళ్లు నింపవచ్చా అని సీఎం వారి దృష్టికి తీసుకుపోగా ఈ కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అన్ని రకాల టెస్టులు చేసిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సేఫ్టీ వారు ఈ ప్రాజెక్టులోని బ్యారేజీలలో నీళ్లు నింపుతే ఆగే పరిస్థితి లేదని స్వయంగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు చెప్పిన విధంగా సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు వారు చెప్పిన విధంగా ముందుకు పోతున్నారు అని అన్నారు. కెసిఆర్ ఇంజనీర్ వారి అల్లుడు హరీష్ రావు సబ్ ఇంజనీర్ అయి కాలేశ్వరం ప్రాజెక్టు కడితే మూడేళ్లకే కూలిపోయింది అని విమర్శించారు. ఈ ప్రాజెక్టులో నీళ్లు ఆపితే కొట్టుకపోయే ప్రమాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో పాటు ఛాయలు టెస్టింగ్ కూడా పూర్తి అయ్యింది అన్నారు. కేటీఆర్ హైదరాబాద్ లేదా కరీంనగర్లోనైనా చిత్తశుద్ధి ఉంటే ప్రెస్ మీట్ పెట్టి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఏ నియోజకవర్గానికి ఎన్ని నీళ్లు ఇచ్చారో చెప్పాలి అన్నారు. మంథని లో డ్యామ్ కడితే అక్కడ నీళ్లు ఉండవు, ఎల్లంపల్లి, నంది మేడారంలో రిజర్వాయర్ లో కూడా నీళ్లు ఉండవు అని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఏ నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వకుండా దొంగ లెక్క మెదక్ కు బీఆర్ఎస్ నాయకులు దోచుకపోయారు అన్నారు.ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా ఆరు లక్షల ఎకరాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నీరు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కడెం ,ఎల్లంపల్లి శ్రీపాద, లోయర్ మానేరు డ్యాం, మంజీరా, వరద కాలువ ఇవన్నీ నిర్మించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఎల్లంపల్లి పైపులైను 2013లో పూర్తి చేసి హైదరాబాదుకు ఐదు టీఎంసీల నీరు ఇస్తుంది కూడా కాంగ్రెస్ పార్టీ అన్నారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్.,పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, రామగుండం మేయర్, మార్కెట్ చైర్మన్లు,కార్పొరేటర్లు,పలు గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు,సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మండల మరియు పట్టణాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 12 రోజుల్లోనే చోరీ ఛేదించిన పోలీసులు

- పది తులాల బంగారు కిలో వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిఎస్పి మొగులయ్య



**వడ్డేపల్లి అక్టోబర్ 26 (జనం సాక్షి) :** వడ్డేపల్లి మున్సిపాలిటీలో సంచలనం సృష్టించిన భారీగా బంగారు చోరీ కేసును శాంతినగర్ పోలీసులు 12 రోజుల వ్యవధిలోనే చేదించారు దానికి సంబంధించిన వివరాలను డీఎస్పీ మొగిలి లయ్య సోమవారం వెల్లడించారు. ఈనెల 14వ తేదీన వడ్డేపల్లి మున్సిపాలికి చెందిన తోట మాధవరావు ఇంట్లో అందరూ ఫంక్షన్కు వెళ్లగా దాన్ని గమనించిన ఏపీలోని కళ్యాణదుర్గం కు చెందిన వడ్డే ఫీట్ల గంగాధర్ అలియాస్ సాంబ ఇంట్లోకి చొరబడి 20 తులాల బంగారు ఒక కేజీ వెండి అపహరించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు ఈ క్రమంలో నేర చరిత్ర ఉన్న వారిపై, గతంలో ఇలాంటి నేరాలకు పాల్పడుతూ జైలుకు వెళ్లిన వారు జైలు నుండి విడుదలైన వారిపై పోలీసులు నిగా పెట్టారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూన్లో జైలు నుండి విడుదలైన గంగాధర్ కదలికలపై కూడా పెట్టారు ఆయన కదలికలలో అనుమానాలు వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. శాంతినగర్ సీఐ శంకర్, ఎస్సై నాగ శేఖర్ రెడ్డి ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి చోరీకి సంబంధించిన వివరాలను సేకరించి పనిని వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే సోమవారం రోజు ఈ బృందానికి చోరీకి పాల్పడిన గంగాధర్ అనుమానాస్పదంగా కనబడుతూ అలంపూర్ చౌరస్తాలో పట్టుబడ్డారు. దీనిపై ఆయనను విచారణ చేపట్టగా అపహరించిన బంగారాన్ని కళ్యాణదుర్గంలోని శైలజ అనే మహిళకు ఇచ్చి ఆమె ద్వారా మరో నలుగురు వ్యక్తులతో కలిసి వివిధ బ్యాంకులలో తాకట్టు చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఆవరణలు కూడా పలు బ్యాంకులలో తాకట్టు చేయగా ప్రస్తుతం 10 తులాల బంగారు ఒక కేజీ వెండి స్వాధీనం చేసుకున్నామని ఇందులో భాగస్వాములుగా ఉన్న మిగతా వారిపై కూడా దృష్టి పెట్టామని వారిని కూడా త్వరలో పట్టుకుంటా మని పేర్కొన్నారు కాగా నిందితడీపై కర్ణాటక తెలంగాణ ఏపీ లలో 50 దాకా కేసులు ఉన్నట్టు తెలిపారు. అత్యంత తక్కువ సమయంలో కేసు చేదించిన సిఐ, ఎస్సై తో పాటు సిబ్బంది అయ్యన్న, గోవిందు, ప్రసాద్, నబి రసూలను ఆయన అభినందించారు వారికి రివార్డు కూడా ఉంటుందని తెలిపారు

# స్టాప్ ఎక్కడ.. బస్సు ఆగేదెక్కడ?

## మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో ప్రయాణికుల ఇక్కట్లు





- బస్టాప్ వద్ద కాకుండా దూరంగా బస్సుల నిలుపుదల..సిగ్నళ్లు లేక ట్రాఫిక్ కష్టాలు
- చలాన్లకే పరిమితం కాకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలి

**మొయినాబాద్ (జనంసాక్షి):** ప్రజా రవాణాను సులభతరం చేసేందుకు ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నా.. బస్సుల నిలుపుదలలో కొందరు డ్రైవర్ల ఇష్టారాజ్యంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో ఏళ్లుగా ఉన్న బస్టాప్ వద్ద బస్సులు నిలపకుండా, దూరంగా ఆపుతుండటంతో మహిళలు, వృద్ధులు, ఇతర ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు చౌరస్తాలో సరైన ట్రాఫిక్ సిగ్నళ్లు లేక వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**సిటీ సర్వీసులున్నా.. ఇబ్బందులే!**

మొయినాబాద్ పరిధిలో తాండూరు, పరిగి, వికారాబాద్, నారాయణపేట తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు గతంలో బస్టాప్ వద్ద నిలుపుదల ఉండేది. ప్రస్తుతం కొన్ని బస్సులు స్టేజీ వద్ద ఆగకుండా దాదాపు 200 మీటర్ల దూరంలో నిలుపుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. సిటీ సర్వీసులు ఉన్నాయంటూ ఇతర బస్సుల్లో ప్రయాణించేవారిని డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారని వాపోతున్నారు. ఉదయాన్నే మెహదీపట్నం, ఎంజీబీఎస్ వెళ్లేవారు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారని చెబుతున్నారు.

**బస్టాప్ వద్ద పార్కింగ్‌తో అవస్థలు**

బస్టాప్ పరిసరాల్లో వాహనాలు, ఆటోలను ఇష్టానుసారంగా నిలపడంతో బస్సులు ఆపేందుకు కూడా స్థలం ఉండటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ముందస్తు స్టేజీ టికెట్ ఉన్నప్పుడు ఇతర ప్రాంతాల్లో బస్సులు నిలుపుతున్నా, ఏళ్లుగా ఉన్న బస్టాప్ వద్ద మాత్రం ఆపకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**సిగ్నళ్లు లేక ప్రమాదాల భయం**

మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో వాహనాల రద్దీకి అనుగుణంగా సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉదయం వేళ లేబర్ అడ్డా వద్ద రోడ్డుపైనే కూలీలు గుమిగూడటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. ప్రమాదాల ముప్పు పొంచి ఉన్నా తగిన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు చలాన్లు విధించడమే కాకుండా, రద్దీని నియంత్రించడంపై పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. బస్టాప్ వద్ద బస్సులు నిలిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ పార్కింగ్‌ను అరికట్టి, ప్రధాన చౌరస్తాలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

# తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తాం

*బ్రిక్స్ పార్లమెంటరీ సమావేశాల్లో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్*



**న్యూఢిల్లీ / హైదరాబాద్, అక్టోబర్ 26:** ఢిల్లీలోని సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం)లో అక్టోబర్ 26, 27 తేదీల్లో జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కూడా పాల్గొన్నారు.అంతకుముందు సోమవారం ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఢిల్లీలో జరిగే బ్రిక్స్ సమావేశాలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయన మాట్లాడుతూ, బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను ఈ సమావేశాల్లో వివరిస్తామని తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. స్పీకర్ గారి పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షలు తెలిపారు.



# గంజాయితో ఇద్దరి అరెస్ట్

### 168 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 26 (జనం సాక్షి):** ఫిల్మ్‌సిటీ ఎదురుగా బాలాజీ డాబా సమీపంలోని ఎన్‌హెచ్-65పై గంజాయితో సంచరిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 25న రాత్రి మణికంఠ, ప్రతాప్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 168 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# వాల్మీకి ఆశయాలు ఆదర్శప్రాయం

### సత్ప్రవర్తనతో ముందుకు సాగాలి : అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మహర్షి వాల్మీకి జీవిత చరిత్ర, ఆయన బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.విజయేందర్‌రెడ్డి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, విద్యాశాఖ అధికారి రేణుక దేవి, గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, ఆడిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివప్రసాద్, రవీందర్, గంగాధర్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సిబ్బంది పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు.

# నూతన పోలీస్ స్టేషన్‌లు, ఏసీపీ కార్యాలయ స్థాపనకు ప్రభుత్వ భవనాల పరిశీలన



**మొయినాబాద్,అక్టోబర్26, జనంసాక్షి:** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించేందుకు అజీజ్‌నగర్ పోలీస్ స్టేషన్, మొయినాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మరియు మొయినాబాద్ ఏసీపీ కార్యాలయాల స్థాపనకు సంబంధించి ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి అజీజ్‌నగర్, హిమాయత్ నగర్, నాగిరెడ్డిగూడ గ్రామాల్లోని ప్రభుత్వ భవనాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నూతన పోలీస్ స్టేషన్‌లు, ఏసీపీ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భవనాలను, వాటి పరిసరాలను పరిశీలించారు. పోలీస్ కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా భవనాల అనుకూలత తదితర అంశాలను సమీక్షించారు. ఈ పర్యటనలో చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ శ్రీ శివం ఉపాధ్యాయ, చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వై. మల్లికార్జున్ రెడ్డి, పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడుకోవాలి

- ఓటు హక్కు పరిరక్షణే దేశ పరిరక్షణ
- నవంబర్ 1న ఢిల్లీలో 'ఓట్ బచావో-దేశ్ బచావో' సభ
- సభను విజయవంతం చేయాలి: ఏఐసీసీ పరిశీలకుడు మోహన్ కుమారన్ మంగళం
- మొయినాబాద్‌లో కాంగ్రెస్ నేతల విలేకరుల సమావేశం



**మొయినాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి):** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఏఐసీసీ పరిశీలకుడు మోహన్ కుమారన్ మంగళం అన్నారు. 'ఓట్ బచావో-దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా సోమవారం మొయినాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా మోహన్ కుమారన్ మంగళం, మరో పరిశీలకుడు అఫ్సర్ జేసోషీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఓటు హక్కును పరిరక్షించడం అవసరమన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'ఓట్ బచావో-దేశ్ బచావో' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి పామెన భీంభరత్ మాట్లాడుతూ నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రఘునాథ్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీంభరత్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి, మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దుబ్బా సోనియా దర్శన్, చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రికెట్ మైదానాలను సందర్శించిన కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

### ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పరిశీలన

**మొయినాబాద్,అక్టోబర్26, జనంసాక్షి:** ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా రాష్ట్రాల వారీగా నిర్వహించనున్న క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రికెట్ మైదానాలను సందర్శించారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు అనువైన మైదానాలు, క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో (ఐజీపీ) గజరావు భూపాల్, చేవెళ్ళ జోన్ డిసిపి యోగేశ్ గౌతమ్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు చేపట్టాలి

- పశుగ్రాసం సాగు, నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి
- వీబీ-జీ రామ్ జీ పనులపై అధికారులకు స్పెషల్ సీఎస్ దిశానిర్దేశం
- సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలి: దాన కిశోర్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ మార్పులు, వర్షపాత లోటు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీటి కొరత, పశుగ్రాసం ఎద్దడి, వ్యవసాయ సమస్యలను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ఎంపీడీవోలతో నిర్వహించిన సమీక్షలో వీబీ-జీ రామ్ జీ పథకం కింద చేపట్టాల్సిన పనులపై ఆయన దిశానిర్దేశం చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి అర్హ కుటుంబానికి నిబంధనల ప్రకారం ఉపాధి కల్పించాలని, నీటి కొరత నివారణకు చెరువులు, కుంటలు, నీటి నిల్వ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూసంరక్షణ, నీటి వనరుల పునరుద్ధరణ పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాసం కొరత తలెత్తకుండా పశుగ్రాస సాగును ప్రోత్సహించాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఉపాధి పనుల అమలు, కూలీల హాజరు, పనుల పురోగతి, నాణ్యతను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని దాన కిశోర్ సూచించారు. మండలాల వారీగా నివాస ప్రాంతాలు, చెరువుల సంఖ్య, ఉపాధి పనుల్లో పాల్గొంటున్న కూలీలు, పథకం కింద చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడి, పశుగ్రాస కొరతను ఎదుర్కొనేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి, రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయం, నీటిపారుదల, పంచాయతీ రాజ్, రహదారులు, భవనాల శాఖలకు సంబంధించిన పనుల వివరాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పెషల్ చీఫ్ సెక్రటరీకి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అడిషనల్ కమిషనర్ రవీందర్, శ్రీనివాస్, జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్‌డీఏ అధికారి శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చదువుల యూనివర్సిటీనా.. సినిమా ప్రమోషన్ల అడ్డానా?

*మల్లారెడ్డి యూనివర్సిటీపై విచారణ జరపాలి*

- విద్యార్థుల భవిష్యత్తును సినిమాలకు తాకట్టు పెడతారా?
- సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి.. యూజీసీ జోక్యం చేసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్ డిమాండ్



**బోడుప్పల్, అక్టోబర్ 26 (జనంసాక్షి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన యూనివర్సిటీలను సినిమా ప్రమోషన్ల వేదికలుగా మార్చడం ఎంతవరకు సమంజసమని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో సినిమా కార్యక్రమాల నిర్వహణ, సినిమా విడుదల సందర్భంగా విద్యార్థులకు సెలవు ప్రకటించినట్లు వస్తున్న వార్తలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**చదువుల కంటే సినిమా ప్రచారానికే ప్రాధాన్యమా?**

అక్టోబర్ 23న యూనివర్సిటీలో 'ఆదర్శ కుటుంబం' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం నిర్వహించారని, అక్టోబర్ 30న సినిమా విడుదల సందర్భంగా విద్యార్థులు సినిమా చూడాలనే ఉద్దేశంతో సెలవు ప్రకటించినట్లు సమాచారం ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. తరగతులు, సిలబస్ పూర్తి చేయడం, విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి పెట్టాల్సిన యాజమాన్యం సినిమా ప్రచారానికి ప్రాధాన్యమివ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలుగుతోందా అనే అంశాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు.

**లక్షల ఫీజులు చెల్లించేది ఇందుకేనా?**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కష్టపడి ఫీజులు చెల్లిస్తున్నా రని, వారి విద్యా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని లక్ష్మణ్ అన్నారు. విద్యార్థుల సమయాన్ని సినిమా ప్రచార కార్యక్రమాలకు వినియోగించడం సమంజసం కాదని విమర్శిం చారు. యూనివర్సిటీల ప్రధాన లక్ష్యం విద్య, విజ్ఞానం, నైపుణ్యాల పెంపొందింపేనని గుర్తుచేశారు.

**సీఎం, యూజీసీ తక్షణమే స్పందించాలి**

ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉన్నత విద్యాశాఖ అధికారులు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్పందించాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సినిమా కార్యక్రమాల నిర్వహణ, సెలవుల ప్రకటన, విద్యా కార్యకలాపాలపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేసే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలకు భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

# నాణ్యత లేని ఆహారంపై కొరడా.. 'మన ఊరి రుచులు' సీజ్





- చికెన్ కర్రీలో గోరు కనిపించిందని ఫిర్యాదు
- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ తనిఖీలు

**పుల్కల్, అక్టోబర్ 26 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన 'మన ఊరి రుచులు' హోటల్‌పై ఆహార నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. హోటల్‌లో నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ హోటల్‌ను తనిఖీ చేసి సీజ్ చేసినట్లు సమాచారం.హోటల్‌లో తయారు చేస్తున్న బిర్యానీ నాణ్యతగా ఉండటం లేదని పలువురు వినియోగదారులు ఆరోపించినట్లు తెలుస్తోంది. ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించడం లేదనే ఫిర్యాదులు కూడా అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. దీంతో హోటల్‌లో వంటగది, ఆహార పదార్థాల తయారీ,నిల్వ విధానం తదితర అంశాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ పరిశీలించినట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా, సుమారు 15 రోజుల క్రితం ఓ వినియోగదారుడు హోటల్ నుంచి తీసుకున్న చికెన్ కర్రీలో గోరు కనిపించిందని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆహారంలో ఇటువంటి వస్తువు కనిపించడం పట్ల వినియోగదారుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో హోటల్‌లో ఆహార తయారీలో పాటిస్తున్న పరిశుభ్రత,నాణ్యతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తాయి.వినియోగదారుల ఆరోగ్యానికి సంబంధించిన విషయం కావడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ సోమవారం హోటల్‌ను తనిఖీ చేసి,నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టి హోటల్ ను సీజ్ చేశారు.

**ఆరోగ్యంతో చెలగాటం వద్దు:**

హోటళ్లలో ఆహార పదార్థాలను తయారు చేసేటప్పుడు పరిశుభ్రతతో పాటు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా మాంసాహార వంటకాల తయారీలో మాంసం నాణ్యత,నిల్వ విధానం, వంటగది పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది.అయితే నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే వినియోగదారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. హోటల్‌ను సీజ్ చేయడంతో పుల్కల్ మండల కేంద్రంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

ఇకపై మండలంలోని ఇతర హోటళ్లు,రెస్టారెంట్లలో కూడా ఆహార నాణ్యత, పరిశుభ్రతపై అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. వినియోగదారులకు నాణ్యమైన,పరిశుభ్రమైన ఆహారం అందేలా సంబంధిత శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆహార నాణ్యత విషయంలో నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సొంత ఖర్చులతో 30 మంది విద్యార్థులకు సైకిళ్లు

- విద్యార్థుల కష్టాలు గుర్తించి.. సర్పంచ్ చేయూత
- కాలినడక కష్టాలకు చెక్.. విద్యార్థులకు ఉచిత సైకిళ్లు
- గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంత్ రెడ్డి



**కొండాపూర్, అక్టోబర్ 26 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలకు కాలినడకన వెళ్లే విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంత్ రెడ్డి తన సొంత నిధులతో 30 మంది విద్యార్థులకు సోమవారం ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. చెర్ల గోపులారం గ్రామం నుంచి మల్లేపల్లి, తేర్పోల్ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రయాణ ఇబ్బందులు తగ్గించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

**విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సమయానికి పాఠశాలలకు చేరుకుని, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో సైకిళు అందించినట్లు అనంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గతంలోనూ మల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసినట్లు గ్రామస్తులు గుర్తుచేశారు. గోపులారం గ్రామంలో పేదలకు ఆర్థిక సాయం అందించడం, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి అండగా నిలవడం, కరోనా సమయంలో సహాయ సహకారాలు అందించడం, శుభకార్యాలకు ఆర్థికంగా తోడ్పడటం వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు.

తమ పిల్లలకు ఉచితంగా సైకిళ్లు అందించడం వల్ల ప్రయాణ కష్టాలు తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అనంత్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేశ్వరి సతీష్, ఉపసర్పంచ్ పుణ్యమ్మ రాములు, వార్డు సభ్యులు పట్నం సురేష్, నవీన్, రవి, సుజాత, మాజీ సర్పంచ్ రత్నయ్య, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# నేను చనిపోతేనే నిధులిస్తారా?

- మంత్రుల నియోజకవర్గాలకే నిధులా
- జడ్చర్ల కోసం 30 వేల మందితో ఆమరణ దీక్ష చేస్తా
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్టోబర్ 26 (జనంసాక్షి):** జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ బిల్లులు, నిధులు వెంటనే విడుదల చేయకపోతే 30 వేల మంది ప్రజలతో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని తీవ్ర హెచ్చరిక చేశారు. సోమవారం రాజాపూర్ మండలం కల్లేపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. కేవలం మంత్రుల నియోజకవర్గాలకే అభివృద్ధి బిల్లులు చెల్లిస్తే, మిగతా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల పరిస్థితి ఏమిటని ఆయన సూటిగా నిలదీశారు. నాగర్‌కర్నూల్‌లో ఒక కాంట్రాక్టర్ మరణిస్తే వెంటనే రూ. 5 కోట్ల బిల్లు విడుదల చేశారని గుర్తుచేశారు. మరి జడ్చర్లలో అభివృద్ధి బిల్లుల కోసం నేను చనిపోతేనే నిధులు ఇస్తారా? నా చావుకే విలువ ఉందా? అని ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. కేవలం కొన్ని ప్రాంతాలు కాకుండా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమంగా అభివృద్ధి చెందితేనే ఏ ప్రభుత్వమైనా మనుగడ సాగించగలదని హితవు పలికారు. పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఒక్కటై పోరాడి జడ్చర్ల నియోజకవర్గానికి కాలువలు, సాగునీరు సాధించుకుందామని పిలుపునిచ్చారు. జడ్చర్ల రైతుల ప్రయోజనాలు, ప్రజల సంక్షేమం కోసం ప్రాణాలనైనా అర్పించడానికి వెనుకాడబోనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# కొమురం భీం ఆశయాల సాధనకు కృషి

- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.180 కోట్లు
- జోడేఘాట్‌లో మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి
- గోయగంలో మిషన్ అమృత్ జల్ పైలట్ ప్రాజెక్టు ప్రారంభం



**కెరమెరి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** గిరిజనుల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం పోరాడిన కొమురం భీం ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన కలలుగన్న సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రులు దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. జోడేఘాట్, పరిసర గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.180 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కొమురం భీం 86వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కేరమేరి మండలం జోడేఘాట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. భీం జెండాను ఆవిష్కరించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమాధి వద్ద అంజలి ఘటించి, గిరిజన దర్బార్, వివిధ శాఖల ప్రదర్శనశాలలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అటవీ నిబంధనలు అడ్డంకిగా మారకూడదన్నారు. ప్రజల కనీస అవసరాల కోసం చేపట్టే పనులకు అధికారులు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అత్యవసర అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఈ ప్రాంతంలో పర్యటించి అవసరమైన పనులపై ప్రతిపాదనలు రూపొందిస్తారని వెల్లడించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థలను బలోపేతం చేసి, జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామన్నారు. టైగర్ జోన్‌కు సంబంధించి ప్రస్తావించిన జీవో నంబర్ 49ను తమ ప్రభుత్వం ఉన్నంతవరకు అనుమతించబోమని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీటి సదుపాయాలు కల్పించడంతోపాటు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## గోయగంలో మిషన్ అమృత్ జల్ ప్రారంభం

జోడేఘాట్ కార్యక్రమం అనంతరం కెరమెరి మండలం గోయగం గ్రామంలో మంత్రి సీతక్క మిషన్ అమృత్ జల్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. గ్రామంలో కిడ్నీ సంబంధిత సమస్యలు, ముఖ్యంగా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించడమే ప్రాజెక్టు లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె. హరిత వివరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కలుషిత నీటిని వినియోగించకుండా శుద్ధి చేసిన నీటినే తాగాలని గ్రామస్తులకు సూచించారు. ప్రాజెక్టును విజయవంతం చేసి, ఇతర గ్రామాలకూ విస్తరించేందుకు సహకరించాలని కోరారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దితే కేంద్రం నుంచి నిధులు, అవార్డులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మట్, ఎస్పీ నితిక పంత్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# చంద్ర నాయక్ తండాలో వ్యభిచారం

- ముఠా గుట్టును రట్టుచేసిన మాదాపూర్ పోలీసులు...

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధి చంద్ర నాయక్ తండాలో గత కొంతకాలంగా గుట్టుచప్పుడుగా కొనసాగుతున్న ఓ వ్యభిచార ముఠా గుట్టును సోమవారం మాదాపూర్ పోలీసులు రట్టు చేశారు. ఈ క్రమంలో కూకట్‌పల్లి ఎస్‌ఓటీ బృందంతో కలిసి, మాదాపూర్‌లోని ఓరియన్ ఎలిగెంట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచార దందాను ఛేదించారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్, సైబరాబాద్ కమిషనరేట్ విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ పోలీసులు కూకట్‌పల్లి ఎస్‌ఓటీ బృందంతో సమన్వయం చేసుకుని ఆదివారం రాత్రి 9 గంటలకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధి మాదాపూర్‌లోని చంద్ర నాయక్ తండా, సర్వే ఆఫ్ ఇండియా కాలనీలో గల ఓరియన్ ఎలిగెంట్ సర్వీస్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెంబర్ 201 పై సంయుక్తంగా దాడి చేశారు. అక్కడ వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు అందించిన ఫిర్యాదుల మేరకు నిర్వహించిన దాడిలో, పోలీసులు ఆ ప్రాంగణం నుండి ముగ్గురు విదేశీ మహిళలను రిస్కు చేయడం జరిగింది. కాగా దుకాణ నిర్వాహకుడిగా భావిస్తున్న నాయక్ అనే వ్యక్తి పరారీలో ఉండడం, ప్రస్తుతం అతని కోసం తీవ్ర గాలింపులను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్వాహకుడిపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పట్టుబడిన మహిళలు ఉజ్బెకిస్తాన్‌కు చెందిన మిస్ రుస్తమోవా మాఫ్తునా(26), మిస్ నపాసోవా గుజల్(26), మిస్ దావ్రానోవా మఖ్లియో(24) అని పోలీసులు తెలుపుతూ ఈ ముగ్గురిని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టి తదుపరి విచారణలు పూర్తి చేయనున్నట్లు అధికారులు వివరించారు.

# ఆర్టీసీ కండక్టర్ ప్రవళికకు అండ

- టీజీఎస్ ఆర్టీసీ ఈడీ సిహెచ్.వెంకన్న భరోసా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** విధినిర్వహణలో ఉండగా ప్రయాణికురాలి దాడిలో గాయపడి హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణుగూరు డిపో ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళికను టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సిహెచ్. వెంకన్న పరామర్శించారు. సోమవారం పలువు అధికారులతో కలిసి సాయిసంజీవని నేరుగా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న ప్రవళిక ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాయపడిన ప్రవళికకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆసుపత్రి వైద్యులకు ఈడీ వెంకన్న ప్రత్యేకంగా సూచించారు. అనంతరం బాధితురాలు ప్రవళికతో పాటు ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఈడీ వెంకన్న, వారికి ధైర్యం చెప్పారు. ఆర్టీసీ యాజమాన్యం ప్రవళికకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, ప్రవళిక కు సంస్థ అన్ని విధాలా సంపూర్ణ భరోసా కల్పిస్తుందని స్పష్టం చేశారు. కండక్టర్‌పై దాడికి పాల్పడ్డ నిందితురాలిపై చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు వేగవంతం చేస్తామని తెలిపారు. విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే ఎంతమాత్రం సహించేది లేదని ఈ సందర్భంగా ఈడీ సిహెచ్. వెంకన్న తీవ్రంగా హెచ్చరించారు. ప్రజాసేవలో నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల రక్షణకు యాజమాన్యం ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని, ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు తెగబడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రవళిక ఆరోగ్య పరిస్థితి పై ఎప్పటికప్పుడు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి లు వైద్యులతో మాట్లాడుతూ ప్రవళిక కు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

# ప్రభుత్వ దావఖానాకు తాళం

- నిండు గర్భిణీ అవస్థలు
- వైద్యం కోసం సిర్పూర్‌కు పరుగులు
- 102కు ఫోన్ చేసినా స్పందన లేదని ఆరోపణ



**కౌటాల అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందుతుందని ఆశతో వచ్చిన నిండు గర్భిణికి నిరాశే ఎదురైంది. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తాళం వేసి ఉండటంతో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. తాటిపల్లి గ్రామానికి చెందిన బోయేర్ పల్లవి, భర్త మంగేష్‌తో కలిసి సోమవారం తెల్లవారుజామున 6 గంటలకు గ్రామానికి చెందిన స్థానిక ఆయా సహాయంతో కౌటాల ప్రభుత్వ దవాఖానకు వచ్చారు. అయితే, ఆసుపత్రికి తాళం వేసి ఉండటంతో వారికి వైద్య సేవలు అందలేదు. దీంతో పురిటి నొప్పులతో బాధపడుతున్న పల్లవిని వైద్యం కోసం సిర్పూర్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర సమయంలో సహాయం కోసం 102కు ఫోన్ చేసిన ప్పటికీ స్పందన రాలేదని బాధిత కుటుంబం ఆరోపించింది. ఈ పరిస్థితిపై పల్లవి భర్త మంగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసవ సమయంలో గర్భిణికి వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.ప్రసవ సమయం సమీపించిన గర్భిణికి అత్యవసర వైద్యం అందించాల్సిన ప్రభుత్వ దవాఖానకు తాళం వేసి ఉండటానికి కారణమేంటి? 102కు ఫోన్ చేసినా ఎందుకు స్పందన రాలేదు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత వైద్యాధికారులు స్పందించి విచారణ జరపాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరంతరం వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రపంచ బౌద్ధ పండితుల కూటమి ఆవిర్భావం

- చైర్మన్‌గా మల్లేపల్లి లక్ష్మయ్య
- రెండేళ్ల కాలపరిమితికి కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక



**హైదరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ వారసత్వ పరిరక్షణ, పరిశోధనల విస్తరణ, పండితుల మధ్య అంతర్జాతీయ సహకారానికి వేదికగా ప్రపంచ బౌద్ధ పండితుల కూటమి ఆవిర్భవించింది. శ్రీలంకలోని మటారాలో అక్టోబర్ 25, 26 తేదీల్లో నిర్వహించిన రెండు రోజుల తొలి సదస్సులో కూటమి వ్యవస్థాపక కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా మల్లేపల్లి లక్ష్మయ్యను నియమిస్తూ ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మటారాలోని చారిత్రక హిత్తేటియా రాజమహా విహారంలో ప్రారంభమైన సదస్సు రెండో రోజు సోలిస్ హోటల్‌లో ముగిసింది. భారత్, శ్రీలంకలకు చెందిన 32 మంది పండితులు, పరిశోధకులు, నిపుణులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విస్తృత చర్చల అనంతరం కూటమి నాయకత్వాన్ని ఖరారు చేసి, రెండేళ్లపాటు బాధ్యతలు నిర్వహించేలా కార్యవర్గానికి ఆమోదం తెలిపారు.కూటమి ముఖ్య సంరక్షకుడిగా అగ్రహారే కశ్యప థేరో, సంరక్షకులుగా డా. గగన్ మాలిక్, కౌశల్య విక్రమసింఘే నియమితులయ్యారు. సమన్వయకర్తగా ప్రొఫెసర్ గామిని రణసింఘే, సహ సమన్వయకర్తలుగా ప్రొఫెసర్ సంతోష్ రౌత్, ప్రొఫెసర్ మహేశ్ దేవకర్, డా. ఈ. శివనాగిరెడ్డి, డా. డబ్ల్యూ.ఎం.టి.బి. విజయపాల బాధ్యతలు చేపట్టనున్నారు.

## బౌద్ధ విజ్ఞాన విస్తరణకు ప్రాధాన్యం

బౌద్ధ వారసత్వ సంపదను పరిరక్షించడం, బౌద్ధ తాత్వికతపై అధ్యయనాలు, పరిశోధనలను ప్రోత్సహించడం, వివిధ దేశాల్లోని పండితులను ఒకే వేదికపైకి తీసుకురావడం కూటమి ప్రధాన ఉద్దేశమని చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. బౌద్ధ విజ్ఞానాన్ని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించడంతోపాటు పరిశోధకుల మధ్య నిరంతర సహకారాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ దిశగా ప్రత్యేక కార్యబృందాలను ఏర్పాటు చేయడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ సమన్వయ కమిటీల ద్వారా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సదస్సు నిర్ణయించింది. వివిధ దేశాలకు చెందిన పండితుల అనుభవం, పరిశోధనా ఫలితాలను పరస్పరం పంచుకునేలా కూటమి కార్యకలాపాలను విస్తరించనున్నట్లు లక్ష్మయ్య వివరించారు.

## శాశ్వత కార్యాలయ నిర్మాణానికి స్థలం

కూటమి కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రస్తుతం మటారాలోని హిత్తిటియా రాజమహా విహార ప్రాంగణంలో తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు లక్ష్మయ్య వెల్లడించారు. విహార అధిపతి అగ్గహేరే కశ్యప నాయక మహా థేరో అనుమతితో ఈ కార్యాలయం పనిచేస్తుందని తెలిపారు. కూటమి శాశ్వత కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కూడా ఆయన అంగీకరించినట్లు పేర్కొన్నారు. సోమవారం సదస్సు సభ్యుల సమక్షంలో దీనికి సంబంధించిన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ అధ్యయనాలు, పరిశోధనలకు బలమైన వేదికను నిర్మించడంతోపాటు వివిధ దేశాల మధ్య సాంస్కృతిక, విజ్ఞాన సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ముందుకు సాగనుందని ఆయన తెలిపారు.

# సామాజిక వాస్తవాలను చిత్రిక పట్టిన తిర్మల్ నీడల ప్రపంచం!




**హైదరాబాద్ (జనంసాక్షి) :** నీడల ప్రపంచం పుస్తకం ద్వారా సామాజిక వాస్తవాలను రచయిత ఎన్.తిర్మల్ చిత్రిక పట్టారని పలువురు రచయితలు ప్రశంశించారు. నీడల ప్రపంచం సమాజంలో నెలకొన్న వివిధ రంగాల్లో ని డొల్లతనాన్ని ఎత్తి చూపుతుంది అన్నారు.వాస్తవాలపై కమ్ముకుంటున్ననీడలను తన కలం వెలుగులో రచయిత పాఠకులకు చూపించారని అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక రవీంద్ర భారతి లో ప్రముఖ కవి హనీఫ్ అధ్యక్షతన జరిగిన ఎన్.తిర్మల్ రాసిన "నీడల ప్రపంచం' పుస్తకావిష్కరణ, అనంతరం సభలోపలువురు ప్రముఖ రచయితలు ప్రసంగించారు. 'నీడల ప్రపంచం' పుస్తకాన్ని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండను అద్దంలో చూపగల్గిన తిర్మల్ నైపుణ్యం ఈ వ్యాస సంకలనంలో కనిపిస్తుందని అన్నారు. జర్నలిజం, రాజకీయం, సామాజికం, తెలంగాణీయం విభాగాలలో విశ్లేషణాత్మక కథనాలు అందించారని అన్నారు.ప్రముఖ పత్రిక సంపాదకుడు, రచయిత సతీష్ చందర్ మాట్లాడుతూసుదీర్ఘ పాత్రికేయ అనుభవం ఉన్న తిర్మల్ వ్యాసాలు వ్యూహాత్మకంగా ఉంటాయని అన్నారు.ఇవాళ చర్చించాల్సిన ఎజెండాను తిర్మల్ నీడల ప్రపంచం లో చూపించారని అన్నారు.చాలా సాదారణ విషయాలను అసాధారణంగా చర్చించి చూపిన విరుపులు పుస్తకం లో కనిపిస్తాయి.శైలిలో భిన్నత్వం కనిపిస్తుంది అన్నారు.జర్నలిజం పైన సైతం పుస్తకం లో చర్చించిన విషయాలు వ్యక్తీకరణ చేసిన తీరుబాగుందిఅన్నారు.తెలంగాణా సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ నీడల ప్రపంచం పుస్తకం ను విశ్లేషించారు.దిక్కార స్వరం గా మొదలైన తిర్మల్ సాహితీ ప్రస్థానం యాభైఏండ్లుగా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నారని అన్నారు. ప్రజా ఉద్యమాలకు వెన్ను దన్నుగా నిలిచిన తిర్మల్ కలం బలం జవసత్వాలు ప్లశంశించకుండా ఉండలేమని అన్నారు. నిచ్చెన మెట్ల నీడల ప్రపంచం ను కూల్చివేశామని అన్నారు. ఇవాల తిర్మల్ లాంటి రచయితల అక్షారాలకు ప్రత్యేక పాఠకులు ఉన్నారని అన్నారు. శాంతిసంఘం తెలంగాణా అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ సామాజిక బృందంతో కూడిన తిర్మల్ జీవితం మట్టి పువ్వు చదువుతుంటే ఆయన జీవితం ఎంతో ప్రజలకు అంకితం అయ్యాడో అర్థం అవుతుంది. నేడు నిర్మల్ రాయిని పత్రిక లేదంటే ఆశ్చర్యం లేదన్నారు.మంచిప్రయోగం చేస్తున్నారని అన్నారు., రచయిత ఎన్.తిర్మల్ పుస్తకం ఆవిష్కరణ కు హాజరైన సాహిత్య కారులకు , తెలంగాణా బాషా, సాంస్కృతిక సంఘం, రవీంద్ర భారతి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## డీజీపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు

**హైదరాబాద్, అక్టోబరు 26 (జనంసాక్షి) :** డీజీపీ కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, భారతీయ సాహిత్యానికి, ఆధ్యాత్మికతకు విశేష సేవలందించిన మహనీయుడని కొనియాడారు. చెడు నుంచి సన్మార్గం వైపు పయనించి, సమాజానికి మానవతా విలువలను చాటిచెప్పిన ఆయన జీవితం స్ఫూర్తిదాయ కమన్నారు. ఈ కార్యక్రమంలో డిజి లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, ఏఐజీ (అడ్మిన్) జె. అన్యోన్య, చీఫ్ సెక్యూరిటీ ఆఫీ సర్ యోగేశ్వర రావు, పేషీ డీఎస్పీ భాస్కర్‌తో పాటు సీఏవోలు, ఏఓలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంటలకు నీరు అందించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ఖానాపూర్ అక్టోబర్ 26 (జనం సాక్షి) :** రైతుల పంటలకు అవసరమైన సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని మేడంపల్లి సదర్మాట్ ప్రాంతాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు . సదర్మాట్ ప్రస్తుత పరిస్థితిని చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సదర్మాట్ బ్యారేజీలో ప్రస్తుతం ఒక టిఎంసి నీరు అందుబాటులో ఉందని, రైతుల పంటలు కోతల దశకు చేరుకున్నాయని, లభ్యంగా ఉన్న నీటిని రైతుల పంటలకు అవసరమైన మేరకు అందిస్తామన్నారు. నది పరివాహకం మధ్యలో ఉన్న నీటి మళ్లింపులు తొలగిస్తే, పంటలకు నీరు అందివ్వడంలో ఇబ్బంది ఉండదు అని పేర్కొన్నారు. నీటిని వృధా చేయవద్దని సూచించారు. రైతులు ఆందోళన చెందకూడదన్నారు. కలెక్టర్ వెంట నీటిపారుదల శాఖ ఈఈ ప్రవీణ్, డిఈ సురేందర్, తహసిల్దార్ సుజాత, ఆయా గ్రామాల సర్పంచ్ లు, అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370